ప్రజాశక్తి

శనివారం 4 అక్టోబర్ 2025   8 పేజీలు



గుంటూరు



పల్నాడు

ప్రచారం అధికం..ఫలితం స్వల్పం..

- ఔషధాల విక్రయంలో మాయాజాలం
- చెప్పులు, షూలు అమ్మకాల్లోనూ వ్యాపారులకే లాభం
- సామాన్యులకు తక్కువ-ధనికులకు ప్రయోజనం ఎక్కువ
- జిఎస్‌టి 2.0 సంస్కరణల ఫలితాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిఎస్‌టి రూపంలో ఎనిమిదేళ్లుగా ఎడాపెడా పన్నుల భారం మోపిన కేంద్ర ప్రభుత్వం రెండో దశ సంస్కరణల పేరుతో పన్నుల పరిమితిని నాలుగు శ్లాబుల నుండి రెండు స్లాబులకు తగ్గించినా ఈ ఫలితాలు సామాన్యులకు తక్కువ, ధనికులకు ఎక్కువగా ఉంటున్నాయి. అయితే ప్రజలందరికీ మేలని, సగటున కుటుంబానికి రూ.15 వేల లాభమని టిడిపి నాయకులు చేస్తున్న ఆర్భాటపు ప్రచారంలో వాస్తవం లేదు. వాహనాలు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు ఇతర విలాస వస్తువులు కొనేవారికి కనీసం ఎంఆర్‌పిపై 10 శాతం వరకు తగ్గుదల కనిపిస్తోంది. ఈ వస్తువుల కొనే బడా రాజకీయ నాయకులు, అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ధనిక వర్గాలకు ఉపయోగమేగాని సామాన్యులకు తక్షణం జరిగే ప్రయోజనం స్వల్పమే. అచ్చంపేట ఎంపిపి రమేష్ శుక్రవారం రూ.17 లక్షల విలువైన కారు కొనుగోలు చేయడం వల్ల తనకు రూ.1.70 లక్షలు ఆదా అయిందని ప్రకటించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన జిఎస్‌టి ప్రచార ర్యాలీలో కొత్త కారుతో ఆయన ప్రదర్శనలో పాల్గొన్నారు. అయితే సామాన్యులకు ఒరిగేందేమిటీ అనే ప్రశ్నకు నాయకుల వద్ద సమాధానం లేదు.



కీలకమైన నిత్యావసర వస్తువులు, పాలు, కూరగాయలు, ఔషధాలు (మందులు), చెప్పులు, షూలు, ఇతర ఫ్యాన్సీ వస్తువులు, వస్త్రాలపై జిఎస్‌టి తగ్గించి అమ్మడం లేదు. ఔషధాలపై జిఎస్‌టి తగ్గించకముందే అన్ని కంపెనీలు దాదాపుగా 10 శాతం పెంచాయి. 2025 జులై వరకు మార్కెట్‌లోకి విడుదల చేసిన పలు రకాల ఔషధాలపై ధరలను పెంచి ఎంఆర్‌పిని ముద్రించి పంపారు. దీంతో దుకాణాల వారు కేవలం 7 శాతం తగ్గించి విక్రయించాల్సిన పరిస్థితి. కొన్ని మందులకు పూర్తిగా జిఎస్‌టిని రద్దు చేసినా తగ్గించడం లేదు. పట్టణ ప్రాంతాల్లో ఔషధ దుకాణాల వారు ఇప్పటికే గరిష్టంగా 22 శాతం వరకు ధరలు తగ్గించి విక్రయిస్తున్నారు. తాజాగా 7 శాతం తగ్గించలేదని వినియోగదారులు ప్రశ్నిస్తే ఎంఆర్‌పి మీద 20 నుంచి 22 శాతం డిస్కౌంట్ ఇస్తున్నందున 7 శాతం తగ్గించలేమని అంటున్నారు. చెప్పులు, షూలపై జిఎస్‌టిని 12 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించారు. కానీ వాటిపై ఉండే ఎంఆర్‌పిలో తాము ఇప్పటికే 10 శాతం డిస్కౌంట్ ఇస్తున్నందున 7 శాతం తగ్గించి ఇవ్వలేమని చెబుతున్నారు. అంతేగాక ఆయా కంపెనీల వారు మాత్రం పాత స్టాకునే 7 శాతం డిస్కౌంట్‌తో ఇస్తామని దుకాణాల వారికి ఆఫర్లు ఇచ్చి విక్రయాలు పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.

సంగం డెయిరీతో పాటు వివిధ పాల డెయిరీలు లీటరుకు రూ.2ను ఆరు నెలల క్రితం పెంచారు. ఇప్పుడు జిఎస్‌టి తగ్గించినా ఇంత వరకు ధరలను తగ్గించలేదు. జిఎస్‌టి ధరలను తగ్గిస్తారని ముందు తెలుసుకుని అన్ని సంస్థల వారు గత ఆరు నెలలు కాలంలో వివిధ రకాల వస్తువులను పెంచారు. ఇప్పుడు తగ్గించమంటే తమ వద్ద పాత స్టాకు ఉందని, కొత్త స్టాకు వచ్చినప్పుడు తగ్గిస్తామని చెబుతున్నారు. తద్వారా గత ఆరు నెలల కాలంలో ధరలు పెంచి ఇప్పుడు కంటి తడుపుగా త్వరలో తగిస్తామంటున్నారు. మాల్స్‌లో నిత్యావసర వస్తువులు, ఇతర దుకాణాల్లో తాము కాంపోజిట్ డీలర్లు అని తాము జిఎస్‌టి చూపినా వసూలు

▸ 2లో



తాడేపల్లిలో

అంబేద్కర్ విగ్రహానికి నిప్పుపై నిరసన

మనువాదుల దుశ్చర్యేనని కెవిపిఎస్ ఆగ్రహం

ప్రజాశక్తి- తాడేపల్లి, మంగళగిరి

చిత్తూరు జిల్లా, దేవళంపేట గ్రామంలో రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పంటించడంపై కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దుశ్చర్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు తాడేపల్లి, మంగళగిరిలోని అంబేద్కర్ విగ్రహాల ఎదుట నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా తాడేపల్లి ఒకటో వార్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి మాట్లాడుతూ రాజ్యాంగం మీద నమ్మకం లేని వాళ్లు, మనువాద సంస్కృతిని తేవాలనుకునే వారే ఈ చర్యలకు పాల్పడతారని అన్నారు. దేశంలో మతోన్మాద బిజెపి అధికారంలోకి వచ్చాక ఇటువంటి చర్యలు నిత్యకృతం అవుతున్నాయని, తాజా ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నవీన్ ప్రకాష్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలందరిపై ఉందన్నారు. మంగళగిరి-తాడేపల్లి బాలోత్సవం కార్యదర్శి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి దుర్మార్గాలను ప్రజలంతా వ్యతిరేకించి తిప్పికొట్టాలన్నారు. పాత మంగళగిరిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలో కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి వై.కమలాకర్ మాట్లాడారు. విగ్రహానికి నిప్పుపెట్టడం ప్రజాస్వామ్య విలువలను మంటగలిపే చర్యన్నారు. ఇందులో మనువాద, మతోన్మాదుల కుట్ర ఉందన్నారు. నిరసనల్లో నాయకులు పి.కృష్ణ, ఎన్.విజయరాజ్, కె.లక్ష్మయ్య, ఎన్.దుర్గారావు, పి.సతీష్, రమేష్, ఎస్.కోటేశ్వరరావు, కె.జీవరత్నం, ఎ.మురళి, టి.విక్టర్‌పాల్, కె.భాస్కర్, కె.దావీదు పాల్గొన్నారు.



మంగళగిరిలో..



నరసరావుపేట సమ్మె శిబిరంలో పిహెచ్‌సి వైద్యులు

విజయవాడలోనే నిరసనకు దిగుతాం

8వ రోజుకు పిహెచ్‌సి వైద్యుల సమ్మె

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పల్నాడు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పిహెచ్‌సి) వైద్యులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 8వ రోజుకు చేరుకుంది. వైద్యులంతా నరసరావుపేటలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో పాల్గొని నిరసన తెలిపారు. పండుగ రోజైన గురువారం సైతం నిరసన కొనసాగింది. ఈ సందర్భంగా ఎపి పిహెచ్‌సి డాక్టర్స్ అసోసియేషన్ పల్నాడు జిల్లా నాయకులు డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ సమస్యలపై ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా విస్మరించడంతో సమ్మెకు దిగామన్నారు. జీఓ 99ను రద్దు చేసి ఇన్ సర్వీస్ కోటాను 30 శాతం క్లినికల్, 50 శాతం నాన్ క్లినికల్ కింద డిపార్ట్‌మెంట్ సీట్లు కల్పించాలని కోరారు. గిరిజన ప్రాంత పీహెచ్‌సీల్లో పని చేస్తున్న వైద్యులకు ట్రైబల్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. 2020 బ్యాచ్ వైద్యులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, చంద్రన్న సంచార చికిత్స అలవెన్స్‌ను రూ.4 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై ప్రభుత్వం స్పందించకుండా నిరంకుశంగా వ్యవహరిస్తే విజయవాడలోనే నిరసనకు దిగుతామని చెప్పారు.

ఉత్తమ నాటికగా నల్ల త్రాచు నీడలో

ఉత్తమ పౌరాణిక పద్య నాటకంగా ఆదికవి నన్నయ భట్టు - ముగిసిన వీణ అవార్డ్స్ నాటకోత్సవాలు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన కళల కాణాచి, ఆర్‌ఎస్‌ఆర్ గ్రీన్ వే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గత నెల 27 నుంచి ప్రారంభమైన జాతీయస్థాయి వీణ అవార్డ్స్ నాటకోత్సవాలు గురువారంతో ముగిశాయి. స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన నాటకోత్సవాల్లో భాగంగా చివరి రోజున విజయవాడకు చెందిన విజయవాడ సాంస్కృతిక సమితి బృందం 'మమ్మల్ని బ్రతకనివ్వండి' సాంఘిక నాటికను ప్రదర్శించారు. సుఖమంచి కోటేశ్వరరావు స్వీయ రచన, దర్శకత్వంలో ప్రదర్శించిన నాటిక ప్రేక్షకులను కంటతడి పెట్టించింది. వృద్ధాప్యంలో ఉన్న ముత్యాలరావు, రమణమ్మ దంపతులు రేకుల షెడ్డులో నివసిస్తుంటారు. భారీ వర్షం కురవటంతో వరద నీటిలో దంపతులు చిక్కుకుంటారు. తమను రక్షించాలని చేస్తున్న ఆర్తనాధాలతో స్పందించి పడవతో వచ్చిన ఒక వ్యక్తి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేయడంతో, తమ వద్ద రూ.5 వేలు మాత్రమే ఉన్నాయని, తన భార్య రమణమ్మను ఒడ్డుకు చేర్చాలని ముత్యాలరావు

▸ 2లో



బుర్ర సుబ్రహ్మణ్య శాస్త్రి పురస్కారాన్ని అందుకుంటున్న సైదులు



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ.. చిత్రంలో పట్టుబడ్డ నిందితులు, పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

9 మంది గంజాయి విక్రేతలు అరెస్టు

పరారీలో మరో 8 మంది - 10 కిలోల సరుకు స్వాధీనం

ప్రజాశక్తి - నకరికల్లు

గంజాయి విక్రయం కేసులో 9 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.10 లక్షల విలువ చేసే 10 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను సత్తెనపల్లి డిఎస్పీ ఎం.హనుమంతరావు శుక్రవారం వెల్లడించారు. రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన నర్ర హనుమంతరావు, విశాఖపట్నం జిల్లా శాలిపేటకు చెందిన పెంటకోట కోటేశ్వరావు, నకరికల్లుకు చెందిన కగ్గా శ్రీనివాసరావు, రాజుపాలెం మండలం పులిచింతలకు చెందిన కాపర్తి మల్లికార్జునరావు, బీహార్ రాష్ట్రానికి చెందిన ఆగయ్య బినోద్, చేజర్ల తండాకు చెందిన బాణావత్ బాలానాయక్, చౌటపాపాయపాలేనికి చెందిన సాదుపాటి శ్రీనివాసరావు, ఆవుల పెద్దసాంబయ్య, కొండమోడుకు చెందిన బండారు హనుమంతరావు కలిసి ఒడిశా రాష్ట్రం

▸ 2లో



ఆయిల్ ఇంజన్లతో పొలాల్లో నీళ్లు బయటకు

ప్రజాశక్తి - కొల్లిపర

అధిక వర్షాల వలన కృష్ణా నదికి భారీ వరదలు రావడంతో కృష్ణాపరివా ప్రాంతంలోని పొలాలు నీట మునిగాయి. మునిగిన వాణిజ్య పంటలైన పసుపు అరటి తోటలో నీరు ఆయిల్ ఇంజన్ల ద్వారా రైతులు బయటకు తోడుతున్నారు. వేలాది రూపాయలు ఖర్చు పెట్టి పంటలు వేశామని, నీళ్ల పొలాల్లో నుండి బయటకు తోడటం అదనపు ఖర్చు అవుతుందని రైతులు తెలుపుతున్నారు.

గాలి నాణ్యత మెరుగుదలకు చర్యలు

గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో గాలి నాణ్యత ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కాలుష్య నివారణ చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సిఎపి) ద్వారా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతున్న పనుల పురోగతిపై జరిగిన జిల్లాస్థాయి అమలు కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, నగర కమిషనర్ పులిశ్రీనివాసులుతో కలిసి సమీక్షించారు. ఎన్‌సిఎపి ద్వారా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో కాలుష్య నివారణకు రహదారుల అభివృద్ధి, మొక్కలు నాటే పనులపై జిల్లా కలెక్టర్ సమీక్షించి, అధికారులకు సూచనలు అందించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం ద్వారా నగరంలో కాలుష్య నియంత్రణకు మంజూరు చేసిన నిధులను సక్రమంగా వినియోగించి గాలి నాణ్యత ప్రమాణాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మెడికల్ క్లబ్‌రోడ్డు, పొన్నూరు రోడ్డు బిటీ పనులకు, మియావాకి ప్లాంటేషన్‌కు రూ.3.56 కోట్లతో అందించిన ప్రతిపాదనలకు ప్రాథమికంగా సమావేశంలో ఆమోదించారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ నసీనా బేగం, డీఎఫ్ఓ హిమశైలజ, డిటిసి సీతారామిరెడ్డి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి, జిఎంసి ఎస్ఈ సుందరరామిరెడ్డి, సిపిసిబి కన్సల్టెంట్ కోమలి తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ వ్యాధిపై రేపు సమగ్ర అవగాహన సభ

ప్రజాశక్తి-గుంటూరు

కేన్సర్ వ్యాధిపై సమగ్ర అవగాహనకు ఈనెల 5న స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో కేన్సరు వ్యాధి నిపుణులు డాక్టర్ రాజీవ్ మోహన్ ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగిస్తారన్నారు. కేన్సర్ వ్యాధిని గుర్తించటం ఎలా, కారణాలను, చికిత్సలో ఆధునిక విధానాల గురించి డాక్టర్ రాజీవ్ మోహన్ వివరంగా తెలియచేస్తారన్నారు. ఆరోగ్యాభి లాషులు అందరూ ఈ సభలో పాల్గొనాలని కోరారు.



ఆర్ఓ ప్లాంటును అందజేస్తున్న సలా వుద్దీన్

పాఠశాలకు ఆర్వో వితరణ

ప్రజాశక్తి - పెదకూరపాడు

స్థానిక ఎంపీపీఎస్ ఉర్దూ పాఠశాలకు వాటర్ ప్లాంట్ ఆర్ఓను ఆ పాఠశాల పూర్వ విద్యార్థి సలా వుద్దీన్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రెండు తాడిశెట్టి సత్యనారాయణ, ఇమామ్ షేక్‌ముస్తఫా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శంకర్ విలాస్ బ్రిడ్జి పనుల వేగం పెంచండి

అధికారులకు కేంద్ర మంత్రి పెమ్మసాని ఆదేశం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక శంకరన్ మినీ మీటింగ్ హాల్లో జరిగిన పంచాయతీరాజ్, రహదారులు భవనాల శాఖ రోడ్ల నిర్మాణాలకు సంబంధించిన అంశాలపై జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి పెమ్మసాని చంద్రశేఖర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మీడియాతో మాట్లాడుతూ శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులను వర్షాలు తగ్గగానే వేగవంతం చేయాలన్నారు. పిఎంజిఎస్‌వై పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. చాలా ప్రాంతాల్లో పనులు పెండింగ్‌లో ఉన్నట్టు గుర్తించి అధికారులతో చర్చించినట్లు తెలిపారు. కొన్ని గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం, నాబార్డ్ గ్రాంట్, నరేగా నిధులతో చేపట్టిన పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ఉన్న అనేక రోడ్లు వర్షాల కారణంగా దెబ్బతిన్నాయన్నారు. గుంటూరు నగరం పరిధిలోని ఆర్ అండ్‌బి రోడ్లను కార్పొరేషన్‌కు అప్పగిస్తే త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. రహదారుల అభివృద్ధికి గుంటూరు కార్పొరేషన్‌లో నిధులు ఉన్నాయన్నారు. నాబార్డ్ సంబంధిత 16 పనుల్లో 6 ఇంకా ప్రారంభం కాలేదన్నారు. గుంటూరు– అమరావతి రోడ్డు నిర్మాణానికి రూ. 6.30 కోట్లు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనుల్లో 115 పైగా పనులు ఇంకా స్టార్ట్ కాలేదన్నారు. ప్రతి పనిని కలెక్టర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని తెలిపారు. వర్షాల కారణంగా రోడ్లన్నీ గుంతలు పడుతున్నాయని వీటిని వెంటనే మరమ్మతులు చేస్తామన్నారు. సమావేశంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఆర్అండ్‌బి ఎస్ఈ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ప్రచారం అధికం..ఫలితం స్వల్పం..

(మొదటి పేజీ తరువాయి)

చేయడం లేదని అందువల్ల ఇప్పటికప్పుడు మినహాయింపులు ఏమీ లేవని చెబుతున్నారు. పండగల నేపథ్యంలో పలు కంపెనీలు భారీ ఆఫర్లతో వ్యాపార లావాదేవీలు కొనసాగించేందుకు వ్యూహరచన చేశాయి. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మింత్ర పోర్టల్లు భారీ ఆఫర్లు ప్రకటించాయి. ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, మోటారు వాహనాలు, విద్యుత్ వాహనాల ధరలు 10 శాతం వరకు తగ్గడంతో ఇప్పటికే కొనుగోలుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్న ఎగువ మధ్య తరగతి, ధనిక వర్గాలకు ఈ సంస్కరణలు తాత్కాలికంగా మేలు చేస్తున్నాయంటున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో తగ్గుదల స్వల్పంగా కనిపిస్తోంది. అయితే మొత్తంగా హోటల్‌లోని వివిధ అవసరాలకు సంబంధించిన బిల్లుల్లో తగ్గుదల కన్పిస్తుంది. రూమ్‌లు, లగ్జరీ సదుపాయాలు పొందే వారికి కొంత లాభదాయకంగా ఉంటోంది.

ప్రధానంగా నిత్యావసర వస్తువులతో పాటు తలనూనె, షాంపూ, సబ్బులు, టూత్‌పేస్ట్, టూత్ బ్రష్, షేవింగ్ క్రీమ్‌పై తదితర వస్తువులపై జిఎస్‌టి 18 నుంచి 5 శాతం తగ్గించినా పాత స్టాకులు అందుబాటులో ఉండటం వల్ల తగ్గించడం లేదు. వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గింపు వల్ల ఆయా పరికరాలు తాజా బిల్లులో తగ్గిస్తున్నారు. ట్రాక్టర్లు, స్పెసిఫైడ్ బయో పెస్టిసైడ్స్ మైక్రో న్యూటియంట్స్, డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ, స్ప్రింక్లర్లు కొనుగోలుపై తగ్గింపు అమలులోకి వచ్చింది. వెన్న, నెయ్యి, మజ్జిగ, ప్రీ ప్యాకేజ్ నమ్‌కీన్, భుజియా, మిక్చర్, వంట వస్తువులపై జీఎస్టీ తగ్గింపు ఇంకా పూర్తిగా అమలులోకి రాలేదు.

ఉత్తమ నాటికగా నల్ల త్రాచు నీడలో

(మొదటి పేజీ తరువాయి)

చెబుతాడు. దీనికి రమణమ్మ నిరాకరిస్తుంది. అదే సమయంలో వరద ఉధృతి పెరగడంతో రమణమ్మ వరద నీటిలో కొట్టుకుపోతుంది. చివరికి ముత్యాలరావు కూడా ఆ వరదలోనే చనిపోతాడు. రేకులషెడ్‌లో నివాసం ఉండటం, వరద రావడం, అదే సమయంలో ఇంట్లోకి పాము రావడం వంటి సన్నివేశాలన్నీ ప్రేక్షకులలో ఉత్కంఠత రేకెత్తించాయి. వృద్ధులు తమను కాపాడాలని వేడుకోవడం, ఆపద సమయంలో డబ్బే లక్ష్యంగా పడవ నడిపే వ్యక్తి వ్యవహారం చిన తీరు మానవత్వానికి మాయని మచ్చగా నిలుస్తుంది.



మమ్మల్ని బ్రతకనీయండి నాటికలో సన్నివేశం

బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి పురస్కారం ప్రదానం..

ప్రముఖ పౌరాణిక రంగస్థల నటులు ఉప్పలపాటి సైదులుకు బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాన్ని అందించి సత్కరించారు. సభలో అజో విభో ఫౌండేషన్ వ్యవస్థాపకులు అప్పాజోస్యుల సత్యనారాయణ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ స్థానం నరసింహారావు తరువాత స్త్రీ పాత్రలో రాణించిన గొప్ప నటులు సుబ్రహ్మణ్యశాస్త్రి అని కొనియాడారు. కళల కాణచి సంస్థ అధ్యక్షులు బుర్రా సాయిమాధవ్ మాట్లాడుతూ నాటక రంగాన్ని అమ్మగా భావించడంతోనే గొప్పగా నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభకు నాటక విశ్లేషకులు కందిమళ్ల సాంబశివరావు అధ్యక్షత వహించగా రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఆర్ఎస్ఆర్ గ్రూప్స్ చైర్మన్ ఆర్.శ్రీకాంత్‌రెడ్డి, విజిబి వివికె ఫౌండేషన్ ప్రతినిధి తుమ్మల కిషోర్, కళల కాణచి కార్యదర్శి గోపరాజు విజయ్, పట్టణ రంగస్థలం కళాకారుల సంఘం అధ్యక్షులు బుర్రా జయలక్ష్మి, వేమూరి విజయభాస్కర్, షేక్ అబ్దుల్ హకీంజానీ పాల్గొన్నారు.

నాటక పోటీల విజేతలు వీరే...

ఆరు రోజులపాటు నిర్వహించిన నాటకోత్సవాల్లో సాంఘిక నాటక విభాగంలో ఉత్తమ ప్రదర్శనగా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారి 'నల్లత్రాచు నీడలో', ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా విశాఖపట్నంకు చెందిన జయ కళానికేతన్ వారి ప్రదర్శన 'సిరికేళి' నిలిచాయి. పౌరాణిక పద్య నాటక విభాగంలో ఉత్తమ ప్రదర్శనగా శ్యామలాంబ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ విజయనగరం వారి 'ఆదికవి నన్నయబట్టు', ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా విజయనగరం అక్కినేని సాంస్కృతిక సమాజం వారి ప్రదర్శన 'మోహిని భస్మాసుర', తృతీయ ఉత్తమ ప్రదర్శనగా మధిరకు చెందిన చందాల కేశవదాసు కళాపరిషత్ వారి 'కస్తూరి తిలకం' నిలిచాయి. సాంఘిక నాటిక విభాగంలో ఉత్తమ నటిగా ఆర్.రాజేశ్వరి, ఉత్తమ నటుడిగా పవన్ కుమార్, సాంఘిక నాటక విభాగంలో ఉత్తమ నటుడిగా జరుగుల రామారావు, నటిగా సురభి లలిత నిలిచారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

9 మంది గంజాయి విక్రేతలు అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి గంజాయిని తెప్పించి చిన్నచిన్న పొట్లాలుగా విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు సత్తెనపల్లి రూరల్ సిఐ పి.కిరణ్, నకరికల్లు ఎస్ఐ సతీష్, ఇతర సిబ్బంది శుక్రవారం తనిఖీలు చేపట్టారు. చల్లగుండ్ల వద్దగల పెట్రోల్ బంకు వద్ద నిందితులను పట్టుకుని వారి వద్ద నుండి గంజాయితోపాటు ఒక ద్విచక్ర వాహనం, ఎలక్ట్రానిక్ కాటా, ప్యాకింగ్ కవర్లు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన మరో 8 మంది పరారీలో ఉన్నారని, వీరందరిపైనా ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

గాంధీ మార్గం అనుసరణీయం

ప్రజాశక్తి- పెదకూరపాడు

ప్రపంచానికి అహింస సత్యాగ్రహం సిద్ధాంతాలను అందిం చిన గాంధీజీమార్గం అనుసరణీయమని మండల టిడిపి నాయ కులు పాటిబండ్ల రత్తయ్య అన్నారు. పెదకూరపాడు మండలం లోని పాటిబండ్ల కారుణ్య వృద్ధాశ్రమం, పెదకూరపాడు గ్రామా లలో భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వశాఖ, మేర యువభారత్, జనచైతన్య సమితి ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను, స్వచ్ఛత సేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జన చైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు మాట్లాడుతూ జీవితంలో అనేక దశలు, ఇబ్బందులు దాటి ముందడుగు వేసిన పెద్దలు చెప్పే మాటలను ఆచరించడం ద్వారా యువతరం తమ లక్ష్యాలను సులువుగా చేరుకోగలుగు తారని అన్నారు. కార్యక్రమంలో పలువు పెద్దలు వారి అనుభవాలను పంచుకోగా, వృద్ధులు చేయగలిగిన సులువైన రోజు వారి వ్యాయమ ప్రక్రియ ను జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు మేడ రాధాకృష్ణ వారితో చేయించారు. కార్యక్రమంలో కారుణ్య వృద్ధాశ్రమ మేనేజర్ ఆచంట హనుమంతరావు (రాము), జన చైతన్య సమితి కోఆర్డి నేటర్ వెలితోటి అనిల్ కుమార్, పాటిబండ్ల రాజారత్నం, షేక్ మాబు, దాసరి కొణ్యుబాబు, గుడిపూడి రాజశేఖర్, బొంత బుచ్చిబాబు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పలు స్వచ్ఛంద సంస్థలు

అనంతరం మొక్కలు నాటి స్వచ్ఛత సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పెదకూరపాడులోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాలువ అప్పారావు, మన్నవ వెంకటరావు, అవ్వారి శ్రీనివాసరావు,కార్యంశెట్టి బాబురావు, కొండవీటి శ్రీనివాసరావు, జన చైతన్య సమితి ప్రతినిధులు తుళ్లూరి సాంబశివరావు, హరిక, అఖిల్ పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవోస్ మంగళగిరి తాలూకా యూనిట్ ఏకగ్రీవం

ప్రజాశక్తి - మంగళగిరి : ఆంధ్ర ప్రదేశ్ నాన్ గెజిటెడ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, మంగళగిరి తాలూకా యూనిట్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ శుక్రవారం అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. సింగిల్ సెట్ నామినేషన్ మాత్రమే వచ్చింది. దీంతో ఎన్నికల అధికారి కే శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ప్రకటించారు.ఆఫీసు బేరర్స్ వారి వివరములు అధ్యక్షులుగా కలిగిరి శ్రీరాములు, సహాధ్యక్షులుగా దాసరి జోసఫ్, వైస్ ప్రెసిడెంట్ గా వి సీతారామశాస్త్రి , ఎస్ సాగర్, బి నాగ బ్రహ్మయ్య , డాక్టర్ ఏ సతీష్ కుమార్, మహిళా ఉప అధ్యక్షులుగా కే శాంతి లక్ష్మి, సెక్రటరీగా దానబోయిన బాల నాగేశ్వరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పిసిహెచ్ లాజరు, జాయింట్ సెక్రటరీస్ గా సిహెచ్ మురళీకృష్ణ, ఎం అనిల్ కుమార్ ,జి చంద్ర కోటేశ్వరరావు, టి వెంకటేశ్వరావు, జాయింట్ సెక్రటరీ మహిళాగా ఎం అమలా జ్యోతి, ట్రెజరర్ గా బి రత్నబాబు, డిస్ట్రిక్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబరు గా పి కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు.



ఎన్నికైన యూనిట్ సభ్యులు

కుల వివక్షకు వ్యతిరేకంగా కెవిపిఎస్ పోరాటం

ప్రజాశక్తి- తాడేపల్లి

అణగారిన వర్గాల హక్కుల కోసం, కుల వివక్షకు వ్యతిరేకంగా రాజీలేని పోరాట సంఘం ఏదైనా ఉందంటే అది కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఒక్కటేనని ఆ సంఘం జిల్లా కార్యదర్శి జొన్నకూటి నవీన్ ప్రకాష్ అన్నారు. కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముగ్గు రోడ్లులోని ఆ సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవీన్ ప్రకాష్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 ఏళ్ళు గడిచిన నేటికీ వివిధ రూపాల్లో వివక్ష కొనసాగటం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. హెూటల్‌లో టీ గ్లాసుల దగ్గర నుంచి అనేక రూపాల్లో నేటికీ అంటరానితనం అనే జాడ్యం రాజ్యమేలు తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు తుంగలో



జెండాను ఆవిష్కరిస్తున్న జొన్నకూటి నవీన్ ప్రకాష్

తొక్క పడుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా బిజెపి అధికారంలో ఉన్న గత 11 సంవత్సరాల కాలంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయని వివరించారు. తమకు నచ్చిన, ఇష్టమైన ఆహారం తీసుకోవటానికి కూడా మతోన్మాదులు విధిస్తున్నారని విమర్శించారు. జనాభా ప్రాతిపదికన తమకు రావాల్సిన హక్కులు, నిధులు రాకుండా అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బిజెపికి వంతపడుతున్నాయని మండిపడ్డారు. ఈ విషయంలో పవన్ కళ్యాణ్ వారు అడుగు ముందుకేసి సనాతన ధర్మం అంటూ సమాజాన్ని వెనక్కి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. భారత రాజ్యాంగమే అందరికీ అత్యుత్తమమైన గ్రంథమని పేర్కొన్నారు. దళిత బహుజన లు తమకు రావలసిన నిధులు, విధులు, హక్కుల కోసం గలమెత్తాల నీ పిలుపునిచ్చా రు. ముందుగా కెవిపిఎస్ జెండాను నవీన్ ప్రకాష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు దర్శనపు విజయబాబు, వై.బర్నబాస్, కోట బాబురావు, గాదే సుబ్బారెడ్డి, వై.శ్రీనివాసరావు, స్థానిక యువకులు పాల్గొన్నారు.



టిడిపి నాయకులతో కలిసి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండల కేంద్రంలో దశాబ్దాలుగా పడకేసిన మౌలిక వసతులకు మోక్షం లభిస్తోంది. దాదాపు రూ.కోటి 35 లక్షల నిధులు మంజూరు కావడంతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పొలం బాటల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. చెంచుకాలనీలో సీసీ రోడ్లకు రూ.20 లక్షలు, గ్రామంలో సీసీ రోడ్లకు రూ. 65 లక్షలు, నడిమి డొంక పొలం బాటకు రూ. 15 లక్షలు, గొట్టిపాళ్ల డొంకపొలం బాటకు రూ. 25 లక్షల నిధుల తో చేపట్టిన పనులపై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మా నందరెడ్డి గురువారం సమీక్షించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ సీనియర్ నాయకులు జూలకంటి చిరంజీవి రెడ్డి, వెంకటరెడ్డి, యువ నాయకులు జూలకంటి నాగార్జున రెడ్డి, అక్కిరెడ్డి, కె.హనిమిరెడ్డి ఉన్నారు.

అదృశ్యమైన బాలుడు మృతి

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక బాలాజీరావుపేటలో బుధవారం అదశ్యమైన ఐదేళ్ల బాలుడు ఆశిక్ రెహమాన్ మృత దేహం ఇంటి సమీపంలోని పడమర కాలువలో గురువారం ఉదయం లభ్యమయింది. ఆడుకునేందుకు ఇంటి నుండి బయటకు వెళ్లి కనిపించకుండా పోయిన ఆశిక్ రెహమాన్ కోసం రాత్రంతా తల్లి దండ్రులు, బంధువులు వెతుకుతూనే ఉన్నారు. మృతదేహం లభ్యం కావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

'నిబంధనల ఉల్లంఘన'

ప్రజాశక్తి - ఫిరంగిపురం

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అధికారికంగా మాంసం విక్రయాలపై నిషేధం ఉన్నప్పటికీ, ఫిరంగిపురంలో ఆ నిబంధనలు గాలికొదిలేశారు. గాంధీ జయంతి రోజున గ్రామపంచాయతీ అధికారులు ముందస్తుగా గ్రామంలో మాంసం దుకాణాలు తెరవకూడదని (ప్రకటన/ప్రచారం) చేసినప్పటికీ, విచ్చలవిడిగా మాంసం విక్రయాలు సాగడం విస్మయం కలిగిస్తోంది. గ్రామంలో మాంసం అమ్మకాలు యధాస్థితిగా కొనసాగుతుండటం ఒక ఎత్తైతే, ఇదే అదనుగా మద్యం విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నట్లు సమాచారం. అక్రమ విక్రయాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు అనేది ఇప్పుడు ఉత్కంఠ భరితంగా మారింది.

అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి - కొల్లిపర

అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమైన ఘటన గురువారం కొల్లిపర మండలం దావులూరు పాలెం గ్రామంలో నెలకొంది. గ్రామానికి చెందిన దేవరకొండ మరియమ్మ ఆమె కుమార్తె మిద్దె నగ్మాకు చెందిన పూరిళ్లు పూర్తిగా దగ్ధం కాగా ఆ సమయంలో ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు శుక్రవారం రెడ్ క్రాస్ తెనాలి వారి తరఫున ఇన్‌ఛార్జి తహశీల్దారు గోపాలకృష్ణ వంట సామగ్రి పంపిణీ చేశారు కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ రాజేష్ ఆర్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో మృతదేహం

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి రైల్వే స్టేషన్ ప్రాంగణంలో గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. మతదేహం ఉండటం గమనించిన ప్రయాణికులు స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇచ్చారు. స్టేషన్ మాస్టర్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతునికి 45 సంవత్సరాలు వయసు ఉంటుందని చెప్పారు. యచకుడై ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వివరాలకు సత్తెనపల్లి పట్టణ పోలీసులను సంప్రదించాలని కోరారు.

జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - ఫిరంగిపురం

జిఎస్టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై మండల కేంద్రమైన ఫిరంగిపురంలో అవగాహన ర్యాలీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో అన్ని దుకాణదారులను కలిసి జిఎస్టి తగ్గుదలపై ప్రజలకు తగిన ప్రోత్సాహంగా ఉండాలని దుకాణ దారులకు సూచించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ప్రజల నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుదల గురించి వివరించారు.కూటమి నాయకులు నరసింహారావు, కొత్తపల్లి కోటేశ్వరావు, పెరికల హదయ రాజు, సర్పంచ్ మేడా బాబు, మాజీ సర్పంచ్ వేళాంగిణి రాజు, అప్పారావు, కటికల రాము, సంపతి నాగేశ్వరరావు, విజయసాగర్, పసలబాబు, బ్రహ్మయ్య, రావూరి నారాయణ రావు, జ్యోతి, కేశవ, పూర్ణ, వి. హరిబాబు, గోసాల విజయ్, వేల్పుల అంకారావు, వేల్పుల గిర్రాజు, తహశీల్దార్ ప్రసాదరావు, ఇన్చార్జ్ ఎంపీడీవో రవిబాబు, ఈవోపీఆర్డి వెంకటేశ్వరరావు, జీఎస్టీ అధికారులుపాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వ్యవసాయ యంత్రాలు, పరికరాలపై 18శాతంగా జిఎస్‌టిని 5 శాతం తగ్గించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం నరసరావుపేట మండలంలోని యల మంద గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల కోసం 'సూపర్ జీఎస్టి-సూపర్ సేవింగ్స్'పై టిడిపి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రారంభించిన అవగాహన ర్యాలీ గ్రామ ప్రధాన వీధులలో కొనసాగింది. ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో డ్వామా పిడి సిద్ధ లింగమూర్తి, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఐ. వెంకట్రావు, మైక్రో ఇరిగేషన్ పిడి సిహెచ్ ఆంజనేయులు, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి రామారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని 75 తాళ్లూరు, కంభంపాడు, జలాలపురం, కాసిపాడు, హుస్సేన్ నగరం గ్రామాలలో సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సులు నిర్వహిం చారు. మండల వ్యవసాయ శాఖ అధికారి డి.కృష్ణయ్య, జిఎస్టి అధికారి స్మిత్నర్ మాట్లాడుతూ వ్యసాయ యంత్రం పరికరాలు, బిందు, తుంపర సేద్యం పరిక రాలు, పంట కోత యంత్రాలు, ట్రాక్టర్, ట్రాక్టర్ విడిబాగాల పై జి ఎస్ టి తగ్గే విధానాన్ని వివరించారు. 75 తాళ్లూరు సొసైటీ చైర్ పర్సన్ ఏటుకూరి రత్నకుమార్, నీటి సంఘాల చైర్మన్ అప్పారావు, మండల టిడిపిఅధ్యక్షులు బ్రహ్మయ్య, జిల్లా టిడిపి కార్యదర్శి ఆర్తిమల్ల రమేష్, సీనియర్ నాయకులు గోపాలరావు. గల్లా బాబు, ఎస్‌కెముంతాజ్, సుందర రామిరెడ్డి, ఆంజనేయులు,ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

బంగారం అపహరణ

ప్రజాశక్తి - కొల్లిపర

మండల పరిధిలోని తూములూరు గ్రామంలో ఎవరూ లేని సమయంలో ఇంక తాళాలు పగలగొట్టి రూ.10 లక్షలు విలువైన అభరణాలు చోరీ చేసిన ఘటన గురువారం రాత్రి నెలకొంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తూములూరు గ్రామానికి చెందిన మోటూరు మధుసూదన్ రావు అతని భార్యని నివాసం ఉంటున్నారు మధుసూదన్ రావు చెరుకుపల్లి మండలంలోని రాజోలు గ్రామంలో రైస్ మిల్లు నడుపుతూ వారానికోసారి తన స్వగ్రామమైన వచ్చి వెళ్తూ ఉంటాడు విజయదశమి పండుగ సందర్భంగా అతని భార్య బంధువుల ఇంటికి వెళ్ళగా తాళం వేసి ఉండటం గమనించి రాత్రి సమయంలో తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న నగలు అపహరించారు. ఇంటి తాళం పగలగొట్టం గమనించిన చుట్టుపక్కల వారు మధుసూదన్‌రావుకు సమాచారం అందించారు. ఆయన వచ్చి బీరువా పగలగొట్టి ఉండటం అందులో బంగారం కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించాడు సంఘటన స్థలాన్ని పరిశీలించి వేలిముద్రల నిపులను పిలిపించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పథకాలపై అవగాహనకు గ్రామసభలు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

బేతపూడి గొల్లపాలెం గ్రామాలలో సర్పంచులు గంధులి ఆదంబి దాసరి మిల్కీయా అధ్యక్షత వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడుతున్న ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కిరణ్మయి, పంచాయతీ కార్యదర్శి మధు, టెక్నికల్ అసిస్టెంట్ రాజేంద్ర రావు, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు, కూలీలు పాల్గొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల పండ్ల తోటలతో పాటు మునగ పశు గ్రాసం వంటి పనులను రైతులు గుర్తించి పనులు చేయించుకోవాలన్నారు. గ్రామాల అభివద్ధికి పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో బేతపూడి పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి ఎనర్జీస్ డిఎ శంకర్ పిఏసి ఎస్ చైర్ పర్సన్ కూరపాటి మాబు టిడిపి పార్టీ ప్రెసిడెంట్ జిలాని గ్రామ పెద్దలు మస్తాన్వలి ఆశ వర్కర్లు ఉపాధి కూలీలు పాల్గొన్నారు

ఆటో డ్రైవర్లకు నేడు రూ.15 వేల జమ

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఆటో డ్రైవర్లకు రూ.15వేలు అందించే కార్యక్రమాన్ని శనివారం స్థానిక సెయింట్ ఆన్స్ హై స్కూల్లో ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఓ సాయిలీల తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ హాజరవు తారని తెలిపారు. నియోజక వర్గంలో అచ్చంపేట మండలం నుంచి 166 మందికి, బెల్లంకొండ మండలం నుంచి 96, క్రోసూరు మండలం నుంచి 204, అమరావతి మండలం నుంచి 401, పెద్దకూరపాడు మండలం నుంచి 187 మందికి అందించనున్నట్లు తెలిపారు.



ప్రధాన దారిలో గుంతలు.. తరచూ ప్రమాదాలు

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట నుండి హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారిలో పెద్ద పెద్ద గుంతలు పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. నరసరావుపేట నుండి రావిపాడు గ్రామ శివారు వరకు అక్కడక్కడ ఉన్న గుంతలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వర్షాల నేపథ్యంలో ఈ గుంతలు కనిపించక వేగంగా వచ్చే వాహనదార్లు ప్రధానంగా రాత్రివేళల్లో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్ అండ్ బి అధికారులు తక్షణం స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

హోటల్ యజమానిపై వైసిపి వారి దాడి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

అల్పాహారం త్వరగా ఇవ్వలేదని హోటల్ యజమానితో పాటు సిబ్బందిపై వైసిపికి చెందినవారు దాడి చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల సమీపంలోని టిఫిన్ హోటల్‌కు మండలంలోని అబ్బూరుకు చెందిన వైసిపి అధికార ప్రతినిధి యమనల నాగార్జున యాదవ్, అతని అనుచరులు గురువారం రాత్రి వెళ్లారు. టిఫిన్ ఆర్డర్ చేయగా కొంచెం ఆలస్యమవుతుందని హోటల్ సిబ్బంది చెప్పారు. దీనిపై కొంత వాగ్వాదం జరిగింది. హోటల్ యజమా శేఖర్‌ను వారు బెదిరించి వెళ్లిపోయారు. కొద్దిసేపటికి మరికొంతమంది వచ్చి హోటల్ యజమానితోపాటు సిబ్బందిపై దాడి చేశారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



బహుమతి పొందిన విద్యార్థినులతో కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, తదితరులు

విజయవాడ ఉత్సవ్‌లో కె-రిడ్జ్ విద్యార్థినులకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దసరా సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయవాడ ఉత్సవ్‌లో ఫోక్ డాన్స్ సీనియర్స్ విభాగంలో నరసరావుపేట మండలం జొన్నలగడ్డలోని కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థినులు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారని స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. కె.ఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన ఉత్సవాల్లో 12 విభాగాలలో మొత్తం 24 గ్రూపులు పాల్గొనగా తమ స్కూల్ విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలవగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) బహుమతులు అందజేసి సత్కరించారని తెలిపారు. విద్యార్థినులను, డ్యాన్స్ టీచర్లు వెంకట్, జ్యోతిర్మయిని స్కూల్ చైర్మన్‌తోపాటు డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపాల్ జి.బర్నబాస్, క్యాంపస్ ఇన్‌ఛార్జి కోట బాపూజీ అభినందించారు.

రెండేళ్లలో చేస్తామన్నా.. ఇప్పటికీ మొదలవ్వని పనులు

ప్రజాశక్తి-క్రోసూరు

- అధ్వానంగా అమరావతి-బెల్లంకొండ రహదారి
- పేదల భూములకు దక్కని పట్టాలు.. సాగు చేయకుండా అడ్డుకుంటున్న అటవీశాఖాధికారులు
- పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థుల అవస్థ : సిపిఎం

క్రోసూరు మండలంలో సమస్యలు పేరుకుపోయాయని, వాటి పరిష్కారానికి అధికారులు, ప్రభుత్వం సత్వరం చర్యలు తీసుకోవాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆమంచి భవన్లో సిపిఎం మండల కార్యదర్శి టి.హనుమంతరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో రవిబాబు మాట్లాడారు. అమరావతి నుండి దొడ్లేరు మీదుగా బెల్లంకొండ అడ్డరోడ్డు వరకు రోడ్డు అధ్వానంగా ఉందని, ఈ రోడ్డు నిర్మాణానికి 2023 జులై 23న అప్పటి సిఎం జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారని అన్నారు. రెండేళ్లలో పనులను పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ చెప్పినా ఇప్పటికీ పనులు చేపట్టలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నరవుతున్నా రోడ్డు నిర్మాణం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా ఉందని విమర్శించారు. మండలంలోని బయ్యవరం, ఊటుకూరు విప్పర్ల గ్రామాల నుండి సుమారు 70-80 మంది విద్యార్థులు క్రోసూరులోని పిడుగురాళ్ల రోడ్డులో ఉన్న మోడల్ స్కూలుకు వెళ్తున్నారని, వీరంతా క్రోసూరు వరకు గుంటూరు నుండి వచ్చే బస్సుల్లో వచ్చి వెంటనే పిడుగురాళ్ల బస్సు ఎక్కాల్సి వస్తోందని, పిడుగురాళ్ల బస్సు సమయానికి లేకపోవడంతో స్కూలుకు వెళ్లడం తరచూ ఆలస్యమవుతూ ఇబ్బంది పడుతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో గుంటూరు నుండి క్రోసూరు వరకు వచ్చే బస్సు మోడల్ స్కూల్ వరకు కొనసాగించే విధంగా సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని కోరారు. క్రోసూరు, అచ్చంపేట మండలాల్లో పేదలు ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్నారని, వారికి ఇప్పటికీ ప్రభుత్వం పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. కొంతమందికి పట్టాలున్నా ఆ రైతులను అటవీ శాఖాధికారులు అడ్డుకుని భూముల్లోకి వెళ్లనివ్వడం లేదని, ఈ విషయమై గతంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో అర్జీలిచ్చినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. పేదల అర్జీలను కూటమి ప్రభుత్వమైనా పరిశీలించి ఇప్పటికే సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని, పట్టాలు ఇచ్చిన భూములను వారికి స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పంట సాగుకు రైతులకు యూరియా అవసరం బాగా పెరిగిందని, కానీ మార్కెట్లో యూరియా కట్ట రూ.450 పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోందని అన్నారు. గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయాలని కోరారు. ఈ అంశాలపై సిపిఎం చేపట్టే ఆందోళనల్లో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని కోరారు. సమావేశంలో నాయకులు జి.ఎలిసెమ్మ, ఏపూరి వెంకటేశ్వర్లు, ఆర్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జి.రవిబాబు తదితరులు

6న స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్వచ్ఛత కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న 'స్వచ్ఛ ఆంధ్ర' అవార్డులను ఈ నెల 6న ప్రదానం చేయనున్నట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్వచ్ఛతా ఎన్జీఓగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డిబిఆర్‌సి) ఎంపికైందని ప్రకటించారు. జిల్లా స్థాయిలో 16 విభాగాల్లో 51 మంది వ్యక్తులు/సంస్థలు అవార్డులు దక్కించుకున్నారని, వీటిని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ద్వారా ప్రదానం చేస్తామని చెప్పారు. స్వచ్ఛ నగరాలు, మండలాలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలలు, ఆసుపత్రులు, కార్యాలయాలు, రైతు బజార్లు, బస్ స్టేషన్లు, పరిశ్రమలు మొదలైన విభాగాల్లో అవార్డులకు ఎంపిక చేశామని వివరించారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, బహిరంగ ప్రదేశాల్లో శుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం (తగ్గించటం, మళ్లీ ఉపయోగించడం, రీసైకిల్), సుస్థిర పద్ధతులలో కొత్త ప్రమాణాలను నిర్దయించడం తదితర అంశాల్లో కృషి ఆధారంగా అవార్డులకు ఎంపిక చేశామని, మొత్తం 17 కేటగిరీలలో ప్రభుత్వం అవార్డులను ఇస్తుందని తెలిపారు. స్వయం మూల్యాంకనం, జిల్లా అధికారుల పరిశీలన, తృతీయ పక్ష మూల్యాంకనంగా మూడు దశల్లో స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు - 2025 రేటింగ్/ర్యాంకింగ్ ఇచ్చారని, స్వయంమూల్యాంకనంలో 1,20,057 కేంద్రాలు పాల్గొన్నాయని, జిల్లా స్థాయి పరిశీలనలో 1,12,833 కేంద్రాల్లో నిర్వహించామని తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డు గ్రహీతల పూర్తి వివరాలను SASA పోర్టల్ (https://sasa.ap.gov.in) నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

3వ దశలో 25 గ్రామాల్లో రీసర్వే : కలెక్టర్

జిల్లాలో 3వ దశ రీసర్వే ప్రారంభమైన నేపథ్యంలో రైతులు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఇప్పటి వరకు 150 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, మరో 41 గ్రామాల్లో జరుగుతుందని తెలిపారు. 3వ దశలో 25 గ్రామాల్లో రీసర్వే చేయబోతున్నామని చెప్పారు. రెవెన్యూ సిబ్బంది భూమి సర్వే ఎప్పుడు చేస్తారో ముందుగా నోటీసు ద్వారా తెలియజేస్తారని, ఆ సమయంలో రైతులు తప్పనిసరిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. రీసర్వేలో రైతుల నుండి అందిన అభ్యంతరాలను పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

అదే ధరలు.. తగ్గినట్లు ర్యాలీలు!

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మొన్నటి వరకూ 5 శాతం, 12 శాతం 18 శాతం, 28 శాతంగా ఉన్న జీఎస్టీని రద్దు చేసి 5 శాతం, 12 శాతానికి తగ్గించినట్లు పెద్ద ఎత్తున ప్రచారం కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. ధరలు తగ్గుతాయని ఊదరగొడుతున్నా తాము కొంటున్న వస్తువుల ధరల్లో మాత్రం మార్పు కనిపించడం లేదని ప్రజలంటున్నారు. బియ్యం, పాలు, పెరుగు ధరలు అలాగే ఉన్నాయి. హోటళ్లలో ఆహార పదార్థాల ధరలు తగ్గలేదు. జీఎస్టీ వల్ల పలానా వస్తువుల ధరలు తగ్గినట్లు మాల్స్ వద్ద బోర్డులేమీ కనిపించడం లేదు. ఎక్కువగా పిల్లలు తినే బిస్కెట్ల ప్యాకెట్లు కూడా పాత ధరల్లోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో జీఎస్టీ తగ్గింపులంటూ జరుగుతున్న ర్యాలీలను ప్రజలు విచిత్రంగా చూస్తున్నారు.

రైతులకు సరిపడా ఎరువులు ఇవ్వండి

ప్రజాశక్తి - వినుకొండ

రైతులకు కావలసిన యూరియా, డిఎపి ఎరువులను సక్రమంగా సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశించారు. రైతుల నుండి ఆయన దృష్టికి వచ్చిన ఎరువుల సమస్యలపై వ్యవసాయ కమిషనర్ ఢిల్లీరావు, జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావులతో ఆయన శుక్రవారం ఫోన్‌లో మాట్లాడారు. రైతు పంట సాగు అవసరాన్ని బట్టి ఎరువులు అందించాలని, సొసైటీ వద్ద ఎరువులు తీసుకోవడానికి వచ్చిన రైతులకు కనీసం మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించిన, అధిక ధరలకు విక్రయించిన, ఒకరికి ఎక్కువ మొత్తంలో ఎరువులు ఇచ్చిన సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం వినుకొండ నియోజకవర్గంలోని సొసైటీ సిఇఒలతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం సొసైటీలో రైతులకు ఎరువులు అందించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఏ సమస్య ఉన్నా తన దృష్టి తేవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్ పాల్గొన్నారు.



ముట్టే రాంబాబుకు సాహితీ వేదిక అవార్డు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

విజయదశమిని పురస్కరించుకొని ప్రముఖ నటులు, అనేక రాష్ట్రస్థాయి అవార్డుల గ్రహీత ముట్టే రాంబాబుకు సరికొండ అచ్చిరాజు మెమోరియల్ సాహితీ వేదిక అవార్డు ప్రదానం చేశారు. సత్తెనపల్లికి చెందిన ప్రముఖ సాహితీవేత్త సరికొండ రమాదేవి ఆమె తండ్రి సరికొండ అచ్చిరాజు మెమోరియల్ సాహితీ వేదికను ఏర్పాటు చేసి ఈ అవార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా రాజుల కాలనీలో ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో రాంబాబుకు అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ న్యాయవాది, నటుడు, రచయిత, దర్శకులు పిన్నమనేని పాములయ్య మాట్లాడుతూ స్త్రీ ఓర్పుతో, సహనంతో తన కుటుంబాన్ని ఒడిదుడుకుల నుండి, కష్టనష్టాలనుండి కాపాడుకుంటూ తీర్చిదిద్దుతుందని అన్నారు. అయితే ఆమెకు కుటుంబంలో కానీ సమాజంలో గానీ తనకు సరైన గౌరవం, స్వేచ్ఛ, సమానత్వం ఇవ్వకుండా వివక్షతకు గురి చేస్తున్నారని, అణచివేతకు గురైన స్త్రీ తన ఓర్పు, సహనం కోల్పోయిన స్త్రీ స్వరూపిణిగా, ఆదిపరాశక్తిగా విజృంభించి పోరాడి విజయం సాధించడమే విజయదశమి అని వివరించారు. ఫొటోగ్రాఫర్ పి.భానుప్రకాష్ తీసిన అద్భుతం, ఆనందం, ఆరోగ్యం, ఆహ్లాదం కలగలిపిన కళా చిత్రం ఫొటో మెమొంటోను, నగదు బహుమతిని భాను ప్రకాష్‌కు ప్రముఖ కళాకారుడు మాతంగి సాంబశివరావు అందించారు. అనంతరం సినీ నటుడు వల్లెం చెన్నకేశవును సత్కరించారు. కార్యక్రమంలో జాషువా, రంగస్థలం నటులు హోటల్ ప్రసాద్, పి.సత్యనారాయణ రాజు, శ్రీనివాసు, ఆంజనేయులు, డి.లూర్దయ్య పాల్గొన్నారు.



రాంబాబును సత్కరిస్తున్న పాములయ్య తదితరులు

అనుమతుల మంజూరు ఆలస్యం చేయొద్దు

ప్రజాశక్తి-గుంటూరు

పరిశ్రమలు, సేవా రంగాల్లో అనుమతుల మంజూరు ఆలస్యం కారాదని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సెకండరీ, సేవా రంగాల శాఖలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెకండరీ, సేవా రంగాలలో జిల్లాలో ఉత్తమ ప్రగతి రావాలన్నారు. సెకండరీ రంగంలో జిల్లా ఉత్తమ స్థానంలో నిలవాలని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు వేగవంతం కావాలని, రాజధాని పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, ఇసుక సరఫరాలో ఎటువంటి సమస్య ఉండరాదని ఆమె ఆదేశించారు. నీటి సరఫరా, మురుగునీటి శుద్ధి కర్మాగారం వంటి వాటికి పక్కా ప్రణాళికలు ఉండాలని ఆదేశించారు. పారిశుధ్యం నగరంలోనూ, ఇతర మున్సిపాలిటీలలో పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. బహిరంగ మలవిసర్జన ఉండరాదని, స్లమ్ ప్రాంతాల్లో అవసరమైతే సామాజిక మరుగుదొడ్లు నిర్మించాలని ఆదేశించారు. సేవా రంగంతో ఆర్థికవద్ధి సాధించాలన్నారు. విజన్ యాక్షన్ ప్లాన్ ప్రకారం నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో సాధించాలన్నారు. జిల్లాలో సేవా రంగం వద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో గల రహదారులు, భవనాలు శాఖ క్రింద ఉన్న రహదారులను నగర పాలక సంస్థకు అప్పగించడం వలన నిర్వహణ మెరుగుదలకు చర్యలు తీసుకోవచ్చున్నారు. మిషన్ గ్రీన్ క్రింద నగర పాలక సంస్థ పరిధిలో ఐదు లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సిపిఒ శేషశ్రీ, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ ఎం.డి.నజీనా బేగం, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఏ.జయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌలురైతు సంఘం నాయకులు అమ్మిరెడ్డి కన్నుమూత

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడారని సిపిఎం, ప్రజా సంఘాల ఘన నివాళి



అమ్మిరెడ్డి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - దుగ్గిరాల

కౌలు రైతు సంఘం దుగ్గిరాల మండల కార్యదర్శి భీమవరపు అమ్మిరెడ్డి(67) గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందారు. పెనుమూలిలోని ఆయన స్వగృహంలో రాత్రి సమయంలో ఛాతీలో నొప్పిగా ఉందని కుప్పకూలి పోయారు. కుటుంబ సభ్యులు హుటా హుటిన తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందారని ధ్రువీకరించారు. అమ్మిరెడ్డికి భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. హైలెవల్ ఛానల్ నీటి సమస్య, మంచికలపూడి వద్ద తుంగభద్ర డ్రెయిన్లో గుర్రపుడెక్క తొలగింపు, పొలాల ముంపు నివారణ కోసం సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించిన పోరాటాల్లో తొలిసారి పాల్గొన్న ఆయన వల్లభనేని సాంబశివరావు నాయకత్వంలో 2017లో సిపిఎం సభ్యులుగా చేరారు. వ్యవసాయం చేసుకుంటూనే కౌలురైతు, రైతు సమస్యలపై జరిగిన పోరాటాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ధాన్యం మద్దతు ధర, గిట్టుబాటు ధరలపై, ప్రజా సంఘాల సమస్యలపైనా అలుపెరుగని పోరాటం నిర్వహించారు. ఆరుపదుల వయస్సులోనూ ఉత్సాహంగా పాల్గొంటూ ప్రస్తుతం కౌలు రైతు సంఘం దుగ్గిరాల మండల అధ్యక్షులు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

హైలెవల్ ఛానల్ కోసం పోరాటం

పార్టీలోకి వచ్చినప్పటి నుండి రైతు సమస్యలపైనా, ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపైనా పోరాడారని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. అమ్మిరెడ్డి భౌతికకాయానికి సిపిఎం గుంటూరూ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, ఈమని అప్పారావు, పసుపు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జన్నా శివశంకర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి



హాజరైన కౌలురైతు, రైతు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు

ఎం.నాగమల్లేశ్వరరావు, సిపిఎం దుగ్గిరాల మండల కార్యదర్శి జె.బాలరాజు, కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా నాయకులు కె.అజయ్, రైతు సంఘం దుగ్గిరాల మండల కార్యదర్శి వై.బ్రహ్మేశ్వరరావు, అధ్యక్షులు ఎన్.యోగేశ్వరరావు పెనుమూలిలోని అమ్మిరెడ్డి నివాసానికి చేరుకున్నారు. పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నేతాజీ మాట్లాడుతూ రైతు, కౌలురైతు ఉద్యమాల్లో అమ్మిరెడ్డి అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు. హైలెవల్ ఛానల్ సమస్యలపై జరిగిన పోరాటాల్లో విశేష కృషి చేశారని పేర్కొన్నారు. సిపిఎం మండల కమిటీ సభ్యులుగా ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించేవారని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా చివరివరకూ పోరాడారని అన్నారు. పాశం రామారావు మాట్లాడుతూ దుగ్గిరాల మండల ప్రజా ఉద్యమాల్లో ఆయనలేనిలోటు తీర్చలేనిదని అన్నారు. రైతు సంఘం నాయకులుగా ఉన్న అమ్మిరెడ్డి కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేశారని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు అన్నారు. అమ్మిరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించిన అనంతరం వారు మాట్లాడారు. దుగ్గిరాల ప్రాంతంలో కౌలు రైతుల సమస్యలపై అమ్మిరెడ్డి పోరాడారని పేర్కొన్నారు. వ్యవసాయంపై సమగ్ర



నివాళులర్పిస్తున్న వై నేతాజీ తదితరులు



నివాళులర్పిస్తున్న పాశం రామారావు తదితరులు

అవగాహన ఉన్న వ్యక్తని, ఆయన మరణం కౌలు రైతు ఉద్యమానికి తీరనిలోటని తెలిపారు అమ్మిరెడ్డి మరణం దుగ్గిరాల మండల పార్టీ ఉద్యమానికి తీరనిలోటని సిపిఎం మండల కార్యదర్శి జె.బాలరాజు అన్నారు. పార్టీ కార్యక్రమం ఉంటే ఆరుపదుల వయస్సులోనూ ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఖచ్చితంగా కార్యక్రమానికి హాజరై ఉద్యమ స్ఫూర్తిని నింపారని అన్నారు. నివాళులర్పించిన వారిలో ప్రజాశక్తి ఎడిటోరియల్ బోర్డు సభ్యులు వల్లభనేని సురేష్, రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కుంచుమాటి అజయ్, ప్రసాదరెడ్డి, జన్నల అప్పిరెడ్డి, టి.పరుశురామ్, తాడేపల్లి మండల రైతు సంఘం నాయకులు డి.వెంకటరెడ్డి, కాజా వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, సిపిఎం మండల కమిటీ నాయకులు బి.చిరంజీవి, గుడిసె యోహాను, వై.స్టాలిన్, కె.శ్రీనివాసరావు, పాములు, జి.శ్రీనివాసరావు, వి.శేషగిరి, వై.కోటేశ్వరరావు, జక్రయ్య, వెంకటరావు, టి.సుబ్బారావు, తదితరులు ఉన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

304వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 304వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకుడు కె.స్టీవెన్, ఆదినారాయణ, తుపాకుల నాగేశ్వరావు, వై.సాంబశివరావు, ఆశీర్వాదం ప్రారంభించారు. దీక్షల్లో ముసలాసాంబశివరావు, దామవరపు నాగేశ్వరావు, పిచ్చయ్య, రావూరి ఇశ్రాయిల్, యహోషువ కూర్చున్నారు. కార్యక్రమంలో శంషాద్దీన్, గురవయ్య, హిమాంభి, శరమ్మా, రమాదేవి, రిబ్కా,శివకుమారి, అన్నమ్మ, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తెనాలి కమిషనర్

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా జె.రామ అప్పలనాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాజాం పురపాలక సంఘ కార్యాలయం నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన బి.శేషన్న బదిలీ కాగా తదుపరి ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వి.లక్ష్మీపతిరావు బాధ్యతలు నిర్వహించారు. ఆగస్టు నెలాఖరుకు ఆయన పదవీ విరమణ చేయడంతో మున్సిపల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కె.శ్రీకాంత్ ఇప్పటివరకు కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించారు. రామఅప్పలనాయుడును మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, ఎంఈ శ్రీకాంత్, ఎంహెచ్ఓ ఏసుబాబు, ఆర్ఓ రాంప్రసాద్, మేనేజర్ విల్సన్ జయకర్, వివిధ విభాగాల సిబ్బంది అభినందించారు.



బాధ్యతలు చేపడుతున్న కమిషనర్ అప్పలనాయుడు

17న ఎమ్‌టిఎంసి వద్ద ధర్నా : సిపిఎం

అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని...

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఎన్నో సంవత్సరాలుగా వివిధ రకాల భూముల్లో ఇళ్లు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సిపిఎం కార్యాలయంలో మంగళగిరి పట్టణ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు టి.శ్రీరాములు అధ్యక్షత వహించారు. రామారావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో 22,000 మంది వివిధ రకాల భూముల్లో పేదలు ఇల్లు వేసుకొని ఎన్నో సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారని వారిలో 3000 మందికి మాత్రమే మంత్రి నారా లోకేష్ ఇళ్ల పట్టాలు ఇచ్చారని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మిగిలిన 19 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా ఇళ్ల స్థలం లేని పేదలకు ఇళ్ల స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారని హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరచాలని అన్నారు. ఈ మేరకు ప్రచారం నిర్వహించాలని అన్నారు. అదేవిధంగా ఎన్నికల కమిషన్ ఎస్ ఐ ఆర్ పేరుతో బిజెపికి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను తొలగించడానికి వ్యతిరేకించాలని అన్నారు. బీహార్ రాష్ట్రంలో 65 లక్షలు ఓట్లు తొలగించారని అన్నారు. ఆ విధంగా దేశం మొత్తం ఎస్ ఐ ఆర్ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందని అన్నారు. వీటికి వ్యతిరేకంగా ప్రజల్లో ప్రచారం చేయాలని కోరారు. సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్ మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ నుండి మంగళగిరి పట్టణంలో వార్డుల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని అర్జీల ద్వారా అధికారులకు వినతి పత్రాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈనెల 13, 14,15 తేదీలలో మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోగల ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాల సాధనకై కార్పొరేషన్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్నట్లుగా తెలిపారు. ఈనెల 17వ తేదీన కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజల పెద్ద సంఖ్యలో పాల్గని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై.కమలాకర్, సిపిఎం సీనియర్ నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు



గాంధీ విగ్రహానికి నివాలులర్పిస్తున్న నాయకులు

చేనేతలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి

టిడిపి కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు ఎన్నికలకు సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ కోరారు. గురువారం గాంధీ జయంతి సందర్భంగా మంగళగిరి పట్టణంలోని పూల మార్కెట్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నేటి ప్రభుత్వాలు గాంధీ ఆశయాలను వదిలేసి పరిపాలన చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేతను ధ్వంసం చేసే విధానాలను అమలు చేస్తుందని విమర్శించారు. ఉచిత విద్యుత్, నేతన్న భరోసా హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కౌతరపు వెంకటేశ్వరరావు, డోకిపర్తి రామారావు, పట్టణ కార్యదర్శి ఎస.నరసింహారావు, పట్టణ సభ్యులు జంజనం శివ భావన్నారాయణ, టి.హేమసుందర రావు తదితరులు పాల్గొన్నారు.

19న బిసి ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బిసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ద్వితీయ మహాసభ ఈనెల 19న గుంటూరులోని పెన్షనర్ల భవన్‌లో జరుగుతుందని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.శివపూర్ణయ్య తెలిపారు. పెన్షనర్ల హోంలో శుక్రవారం జరిగిన మీడియాలో సమావేశంలో ఆయన మాట్లాడారు. పదోన్నతుల్లో బిసి ఉద్యోగులకు మెరిట్ కం రోస్టర్ విధానం అమలుపై చర్చ జరుగుతుందన్నారు. తరువాత రాష్ట్ర కమిటీకి ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ సమావేశం విజయవంతం చేసేందుకు ఈనెల 5న సన్నాహక కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు పి.వి.రమణయ్య, వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.వి.ప్రసాద్, ఆర్థిక శాఖ కార్యదర్శి కె.నరసింహరావు, నాయకులు ఎస్‌వి సత్యనారాయణ, అప్పలరాజు, జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బారావు, నగర అధ్యక్షులు వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఏయన్ఎం ధనలక్ష్మి

దోమల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణంలోని పోలిరెడ్డి పాలెం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది యం. వెంకటేశ్వర్లు పాఠశాల విద్యార్థులకు దోమల నివారణపై అవగాహన కల్పించారని ప్రధానోపాధ్యాయురాలు జె.హైమావతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ పగటి పూట దోమలు కుట్టడం వల్ల అనేక వ్యాధులు వస్తాయి కాబట్టి కాళ్ళ చేతులు కప్పి ఉంచేలా దుస్తులు ధరించాలన్నారు. రాత్రిపూట దోమ తెరలు వాడాలని తెలిపారు. విద్యార్థులు పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఏయన్ యం ధనలక్ష్మి మాట్లాడుతూ భోజనానికి ముందు సబ్బుతో చేతులు శుభ్రపరుచుకోవాలని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు పి.శైలజ, శ్రీనివాసరావు, జి.ఆదిలక్ష్మి, కె.అరుణ, సిహెచ్ నవ్యశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.



వస్త్రాలు అందజేస్తున్న గోవిందరెడ్డి

నిరుపేద కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి - మాచర్ల

స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ మాచర్ల వారి ఆధ్వర్యంలో ముగ్గురు వృద్ధులకు వస్త్రాలు నిత్యావసర సరుకులు అందజేశారు. స్థానిక పిడబ్ల్యూ కాలనీలోని జడ్పీ బాయ్స్ హైస్కూల్ ఎదురుగా పూరి గుడిసెలో నివాసం ఉంటున్న దేరంగుల వెంకటేశ్వర్లు, ఆయన భార్య అంజమ్మ, దివ్యాగురాలైన కూతురు లక్ష్మి నివాసం ఉంటున్నారు. భార్యకు రెండు కళ్ళు కనపడవు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు వీరి విషయం స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ గోవింద రెడ్డికి తెలియపరచగా ఆయన స్పందించి ఆ ముగ్గురికి నూతన వస్త్రాలు, నిత్యావసర సరు కులు అందజేశారు. అంజమ్మకు రెండు కళ్లకు ఆపరేషన్ చేయి స్తామని గోవిందరెడ్డి హామీ నిచ్చారు. ప్రతినెల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేస్తానని తెలిపారు.



ప్రింటర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థి

పాఠశాలకు పూర్వ విద్యార్థి వితరణ

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని లింగారావుపాలెం ఎంపిపి పాఠశాలకు పూర్వ విద్యార్థి చార్టర్డ్ అకౌంటెంట్ నంబూరు నరసింహారావు ఒక ప్రింటర్, ఫింగర్ ఆథంటిఫికేషన్ డివైజ్‌ను రూ.24 వేలతో సమకూర్చారు. వీటిని పాఠశాల హెచ్ఎం షేక్ నజీర్ అహ్మద్‌కు శుక్రవారం అందజేశారు. నంబూరి శివరామకృష్ణ, తోకల సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గాంధీజికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహాత్మా గాంధీకి ఘన నివాళులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధానమంత్రి లాల్ బహుదూర్ శాస్త్రిజీ జయంతిని కార్యక్రమాన్ని పురస్కరించుకుని నాదెండ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ బాజీ అధ్యక్షతన స్థానిక ప్రధాన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ ఉపా ధ్యక్షుడు చేరెడ్డి శ్రీరామ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రెడ్డెం నర్సిరెడ్డి సీనియర్ కాంగ్రెస్ రైతు విభాగం నాయకులు రామ కోటేశ్వరరావు రాష్ట్ర కాంగ్రెస్ మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ నసీరుద్దీన్, నాదెండ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ బాజీ మండల అధ్యక్షులు నరసింహారావు జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి భవానీ వెంకటేష్ మైనారిటీ నాయకులు షేక్ లాలు సలాం, పాల్గొన్నారు.

సత్తెనపల్లి టౌన్ : జాతిపిత మహాత్మా గాంధీ జయంతి భారతదేశ రెండవ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షులు దాసరిజ్ఞాన్ రాజ్ పాల్ మాట్లాడారు. మాదంశెట్టి వేదాద్రి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, షేక్ చాంద్‌బాష, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కొత్తలక్ష్మయ్య, పల్నాడు జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఆనంద్, ముప్పాళ్ళ మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్‌రావు, మాజీ సేవాదల్ అధ్యక్షులు జెట్టి శేఖర్ కాంగెస్ పార్టీ ఆఫీస్ ఇంచార్జ్ పాల్‌రాజు, అంబేద్కర్ యువజన సంఘం షేక్ హైదర్‌ఆలీ, టీ.దాసు, మెకానిక్ శివ, అయ్యప్ప అజీమ్, సంగీతరావు, కే.హనుమంతరావు జి.చార్లెస్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

సత్యం, అహింసా సిద్ధాంతంతోనే రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి దేశానికి స్వాతంత్ర్యం తేవడంతో ద్వారా వాటి శక్తి ప్రపంచానికి చాటిచెప్పిన ధన్యజీవి మహాత్మాగాంధీ అని వినుకొండ ఎమ్మెల్యే చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కొనియాడారు. నరసరావుపేట రోడ్డులోని గాంధీ విగ్రహానికి ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జున రావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

గాంధీ జయంతి సందర్భంగా సత్తెనపల్లి లయన్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్‌జైలులో ఖైదీలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు, పండ్లు పంపిణీ చేశారు. బండ్లమూడి వీరాంజనేయులు, జైలుఅధికారులు వెంకటరత్నం, ఫాస్ట్ ప్రెసిడెంట్ పొన్నెకంటి కిషోర్‌కుమార్ కంకణాల విష్ణువర్ధన్ పెద్దింటి వెంకటేశ్వర్ల తవిటి భవనారాయణ వి.వి. కష్ణమాచార్యులు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

మహాత్మా గాంధీజీ జయంతిని ఎడ్లపాడు పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎడ్లపాడు పోలీస్‌స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ శివరామ కృష్ణ పాల్గొని, గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జాతిపిత మహాత్మా గాంధీ 156వ జయంతి సందర్భంగా పట్టణంలోని వివిధ ప్రాంతాలలోని గాంధీ విగ్రహానికి నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ గాంధీజీ అహింసా, సత్యాగ్రహ సిద్ధాంతాలను ప్రతి పౌరుడు అమలు చేస్తూ సమాజానికి, దేశానికి సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజకీయ, సామాజిక కార్యకర్తలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎస్టీపై పలుచోట్ల ప్రచారం

ప్రజాశక్తి - కారంపూడి

మండలంలోని ఇనుపరాజుపాల్లి, కారంపూడి గ్రామాలలో టీడీపీ మండల అధ్యక్షులు జి.సురేష్ యాదవ్, కారంపూడి పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షులు బాలకృష్ణ ఆధ్వర్యంలో సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్ కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ దసరా సందర్భంగా మధ్యతరగతి ప్రజలకు జిఎస్టీ తగ్గింపు ఉపయోగకరం అవుతుందని దీనికి సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించారు. పాతరేట్లకు ఎవరైనా అమ్మకాలు సాగిస్తే దయచేసి వాటిని కొనుగోలు చేయొద్దని తగ్గిన జిఎస్టి ధరల ప్రకారమే వస్తువులను కొనుగోలు చేయాలని వారు సూచించారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

జిఎస్టి తగ్గింపుపై వ్యాపారులకు వినియోగదారుల ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అవగాహన కల్పించారు. సత్తెనపల్లి పట్టణంలో ఎమ్మెల్యే కొత్త జీఎస్టీపై వ్యాపారుల అభిప్రాయాలు శుక్రవారం తెలుసుకున్నారు. వ్యాపారుల ఇబ్బందులు, వసూళ్లలో తేడాలపై ఆరా తీసారు. విని యోగదారులకు అవగాహన కల్పించారు. టిడిపి పట్టణ అధ్యక్షులు మస్తాన్‌వలీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని లింగారావుపాలెం గ్రామంలో శుక్రవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా వ్యవసాయ, అనుబంధ రంగాలపై జిఎస్టి తో ఆదా గురించి మండల వ్యవసాయ అధికారి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవ సాయాధికారి ఏ.హరిప్రసాద్, జగ్గాపురం వెటర్నరీ డాక్టర్ బి. కబ్బిరెడ్డి, బి లక్ష్మీ శేష సాయి, ఎంపీటీసీ వీరరాఘవయ్య, గ్రామపెద్దలు కట్టాశ్రీహరి, నంబూరి కృష్ణారావు, రాజేషు, సాదినేని సుధీర్, శ్రీధర్ కుమార్, నంబూరు శివరామకృష్ణ, సాంబశివరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని మాదల గ్రామంలో శుక్రవారం సూపర్ జిఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎమ్.జగ్గారావు పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, మాదల పిఎసియస్ చైర్ పర్సన్ పౌలురాజు,సర్పంచ్ తిరుమలశెట్టి సైదుబాబు, రావిపాటి మధుబాబు, నానయ్య, పంచాయతీ కార్యదర్శి శివాజీ, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాదెండ్ల

మండల కేంద్రం నాదెండ్లలో శుక్రవారం వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో మండల స్థాయిలో 2.0 జిఎస్టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. నాదెండ్ల సొసైటీ చైర్మన్ శ్రీ నల్లమోతు హరిబాబు, ఇంచార్జి తహశీల్దార్ షేక్‌సాల్మన్, ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాస్‌రావ, వ్యవసాయ అధికారిని టి.శ్రీలత మండల స్థాయి అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

పలువురికి పిఆర్‌కె పరామర్శ

ప్రజాశక్తి - కారంపూడి

కారంపూడిలోని వైసీపీ నాయకుడు పల్నాడు జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అక్బర్ జానీబాషా అనారోగ్యంతో బాధపడుతున్నారన్న విషయం తెలుసుకొన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణరెడ్డి శుక్రవారం అయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఒప్పిచర్ల గ్రామానికి చేరుకుని మాజీ ఎంపీపి పి.వెంకటనరసయ్య, సోదరుడు సీనియర్ జర్నలిస్ట్ క్యాపిటల్ వాయిస్ ఎడిటర్ పి.బుచ్చిబాబు తండ్రి పి.అనంతరామయ్య ఇటీవల మరణించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటికి వెళ్లి అనంతరామయ్య చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

జీఎస్టీపై సూపర్ సేవింగ్స్‌పై నేడు అవగాహన

ప్రజాశక్తి - మాచర్ల

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న జిఎస్టి 2.0 క్రింద సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్‌పై శనివారం స్థానిక మున్సిపల్ ఆఫీస్ మాచర్లలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. పిడుగురాళ్ల రాష్ట్ర పన్నులు అసిస్టెంట్ కమిషనర్ పి. నారాయణ శాస్త్రి , డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ పి. శేషగిరి, నోడల్ ఆఫీసర్ ఎస్‌కె. ఇమ్రాన్ ఖాన్, స్పెషల్ జిఎస్టి ఆఫీసర్ టీ. పీటర్ బాబు పాల్గొని జీఎస్టీ ఫలాలు ప్రజలకు చేరువ చేయడానికి వివిధ విభాగాల అధికారులు, వ్యాపార సంస్థల అసోసియేషన్లు, ఆడిటర్లు, అకౌంటెంట్లుకు అవగాహన కల్పింస్తారు. కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని అధికారులు సూచించారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - వెల్దుర్తి

ఆరోగ్యాంధ్రానే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. శనివారం వెల్దుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 66 మంది లబ్ధిదారులకు రూ. 47 లక్షల 72 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి నగదు చెక్కులను ఆయన అందజేశారు. పలు మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గాంధీకి నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

స్వచ్ఛతా హీ సేవా వారోత్సవాల ముగింపు

ప్రజాశక్తి - కారంపూడి

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలోగాంధీ జయంతి, స్వచ్ఛతహీ సేవా వారోత్సవాల ముగింపు సందర్భంగా అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించి, గ్రామాభివృద్ధి ప్రణాళికలు, ఎంజిఎన్ఆర్జిఎస్ అభివద్ధి పనులు, సంపూర్ణ పారిశుధ్యం, ప్లాస్టిక్ నిషేధం, బహిరంగ మలవిసర్జన రహిత మండలంగా అన్ని గ్రామ పంచాయతీలు తీర్మానం చేశాయి. టిడిపి రాష్ట్ర కార్యదర్శి అంజయ్య,, ఆయా గ్రామ సర్పంచులు సరస్వతి బాలు నాయక్, పుష్పావతి, కందిమల్ల లక్ష్మయ్య, ఎంపీటీసీలు బి.కనకదుర్గ, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పంచాయతీ కార్యదర్శులు కసిన్యా నాయక్, సైదమరాజు, రామరాజు, రవీంద్ర, వెంకటేశ్వర్లు, ఏపీవో నాగేశ్వరరావు, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, మండల పరిధిలోని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, స్థానిక గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుదాసుకు సన్మానం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి అయిన అంకాళ్ళ ప్రభుదాసును ప్రజా చైతన్య భారత్ అనే స్వచ్ఛంద సేవ సంస్థ వారు గురువారం సత్కరించారు. ముందుగా స్థానిక సబ్ జైల్ దగ్గర ఉన్న మహాత్మా గాంధీ, దేశ రెంవ ప్రధాని అయినా లాల్ బహుద్దూర్ శాస్త్రీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో సంస్థ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో జాకి రామయ్య, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - కారంపూడి

దేవీ నవరాత్రి ఉత్సవాలు 11 రోజులుగా ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పలుచోట్ల బతుకమ్మను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను నిర్వహిం చారు. రోజుకొక రూపంలో అమ్మవారు భక్తులకు దర్శన మిచ్చారు చివర రోజైన దసరా రోజున సద్దుల బతుకమ్మగా భక్తులకు దర్శనమిచ్చారు. బతుకమ్మను వివిధ రకాల పూలతో అలంకరించి అమ్మవారికి ఇష్టమైన పలురకాల నైవేద్యాలు సమర్పిం చారు అనంతరం బతుకమ్మను నీటిలో నిమజ్జనం చేశారు. వల్లేబాయ్ డొంకలో ఏర్పాటుచేసిన దేవీ నవ రాత్రి ఉత్సవాలు, బతుకమ్మ నిమజ్జన బతుకమ్మ నిమజ్జనా కార్యక్రమంలోమహిళా భక్తులు, యువకులు పాల్గొన్నారు.

గాంధీ జయంతి రోజునా మాంసం అమ్మకం!

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

గాంధీ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో మాంసం విక్రయాలు, మద్యం విక్రయాలు జరగకుండా చూడాల్సిన అధికారులు ప్రేక్షక పాత్రను పోషించారు. అధికారుల పర్యవేక్షణ కొరవాడటంతో పట్టణంలో మాంసం విక్రయాలు కొన్ని ప్రాంతాలలో అమ్మకాలు జరిగాయి. పట్టణంలోని ప్రధాన రహదారుల్లోనే విక్రయాలు జరగ టంతో మున్సిపల్ అధికారుల పనితీరుపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తాయి. మాంసం విక్రయాలు జరగకుండా చర్యలు చేపట్టాల్సిన అధికారులు మౌనపాత్ర వహించటంలో అంతర్యం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు.

నేడు ఆటో డ్రైవర్లతో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - మాచర్ల రూరల్



ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ఆటో డ్రైవర్ సేవ పథకంలో భాగంగా లబ్ధిదార్లకు శనివారం నగదు జమ చేయనున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఆటో డ్రైవర్ల ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు మాచర్లలోని రింగ్ రోడ్డు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ ఉంటుందని, అనంతరం మాను కొండ కళ్యాణ మండపంలో ఆటో డ్రైవర్లతో సమావేశం జరుగుతుందని తెలిపారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న హోటళ్లు

వాసన వెదజల్లే ఆహారాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని రెస్టారెంట్లు, తినుబండారాల స్టాల్స్, నూడిల్స్ విక్రయ కేంద్రాలు, హెూటల్స్ ఇలా దాదాపు అనేక చోట్ల నిల్వ ఉన్న ఆహార పదార్థాలను ప్రజలకు అంట గడుతున్నారు. దీంతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడు తున్నారు. ఓ పక్క వర్షాకాలం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో ఇటీవల మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించాలని హెూటళ్ల యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ ఏ మాత్రం లెక్క లేకుండా వ్యవహరిస్తున్నారు. మంగళగిరి లో హెూటల్లో ఓ వ్యక్తి గురువారం కాజూ ఫ్రైడ్ రైస్ పార్సిల్ చేయించుకొని రూ. 250 చెల్లించాడు. ఇంటికి వెళ్లి ఓపెన్ చేస్తే దుర్వాసన వెదజల్లడంతో తిరిగి హెూటల్‌కు వెళ్ళి ఇదేమిటి నిల్వ ఉన్న ఆహారాన్ని ఇచ్చారు. అని నిలదీశాడు. తమ ఆహారంలో ఎటువంటి లోపం లేదని డాబా యజమాని బుకాయించాడు. మంగళగిరిలో ఇటీవల అనేక రెస్టారెంట్లు, హోటళ్లు ఏర్పాటు అవుతున్నాయి. ప్రజల నుండి వసూలు చేస్తున్న సొమ్ముకు తగినట్లుగా ఆహారంలో నాణ్యత శుచి, శుభ్రత ఉండటం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ఆటోనగర్ పరిధి గౌతమ బుద్ధ రోడ్డుపై ఉన్నటువంటి విక్రయ కేంద్రాల్లో న్యూడిల్స్ నందు మట్టి, ఇసుక దర్శనమిస్తోందని పలువురు వాపోతున్నారు. కొద్ది సంవత్సరాల క్రితం ఇదే ప్రాంతంలో ఏపీఐఐసీకి వెళ్లే కూడలిలో ఓ రెస్టారెంట్‌ను తనిఖీ చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు నిల్వ ఉన్న మాంసాహారాన్ని కాలువలో పడి వేశారు. ఆ ఆహారాన్ని టెస్టింగ్ నిమిత్తం పంపిస్తున్నామని రిపోర్ట్ వచ్చాక చర్యలు తీసుకుంటామని తెలిపారు. రిపోర్టు ఏమైందో తెలియదు చర్యలు తీసుకుంది లేదు. గౌతమ బుద్ధ రోడ్డుపై బస్టాండ్ ఎదురుగా ఉన్న ఓ హోటల్, బేకరీ, కర్రీ పాయింట్, పాత గ్యాస్ కంపెనీ ఎదురుగా ఉన్న హోటల్‌లో లభ్యమయ్యే ఆహార నాణ్యత పై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో హెూటళ్లు రెస్టారెంట్లు నందు ప్రజలకు విక్రయించే ఆహార కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ లోపించింది. అప్పుడప్పుడు పర్యవేక్షణ తూతూ మంత్రంగా ముగించేసి వెళ్లిపోతుం డటం పలు అనుమానాలకు తావిస్తోంది. రెస్టారెంట్లలో కేవలం సానిటేషన్ వరకు మాత్రమే తాము పర్యవేక్షించే బాధ్యత ఉందని ఆహార నాణ్యత ఫుడ్ సేఫ్టీ అధికారులు చూడాలని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఇటువంటి వారిపై చర్యలు తీసుకోకపోవడం వలన ప్రజలకు ఆహారం అందించే విషయంలో నాణ్యత ప్రమాణాలు ఏ మాత్రం పాటించటం లేదన్న అభిప్రాయం సర్వత్ర వ్యక్తం అవుతుంది. రాజధాని ప్రాంతంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న మంగళగిరికి ఓ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ను నియమించడంతోపాటు నిబంధనలను ఉల్లంఘించే హోటళ్ల యజమానులపై చర్యలు తీసుకుని ఇటువంటి జరక్కుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సిపిఎం అభిమాని గంగిరెడ్డి మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

ప్రజాశక్తి - తాడేపల్లి

స్థానిక సుందరయ్య నగర్‌కు చెందిన సిపిఎం అభిమాని గంగిరెడ్డి వెంకటేశ్వర్లు శుక్రవారం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. సుదీర్ఘకాలం సిపిఎం సభ్యులుగా కొనసాగారు. సుందరయ్య నగర్ ఆవిర్భావం నుండి వెన్నుపూస మాలకొండ రెడ్డితో కలిసి పని చేశారు. గంగిరెడ్డి మఅతికి సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. గంగిరెడ్డి మఅతి వార్త తెలియగానే పార్టీ సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, తాడేపల్లి మాజీ సర్పంచ్ డిశ్రీనివాస కుమారి, తాడేపల్లి పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు గాఎ సుబ్బారెడ్డి, స్థానిక సుందరయ్య నగర్ శాఖ కార్యదర్శి గిరిజాకుమారి, వై.బర్న బాస్, డి.వి.భాస్కర్‌రెడ్డి, సిపిఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.వెంకట్రావు, కె.గడ్డన్న, సుధా, కొట్టే కరుణాకర్ రావు, ప్రభాకర్, కొండబాబు ఇతర, సభ్యులు నివాళులర్పించారు.

ఐఆర్ఎస్ అధికారి కారులో చోరీ!

నగదు, బంగారం మాయం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో ఓ వేడుకలో పాల్గొనేందుకు వచ్చిన ఐఆర్ఎఎస్ అధికారి కారులో చోరీ జరిగింది. వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఐఆర్ఎఎస్ అధికారి శ్రీరామ్ శాంతి రాజు గురువారం రాత్రి చెంచుపేట ఎస్ ఎల్ ఎస్ ఫంక్షన్ హాలులో జరుగుతున్న వివాహ వేడుకకు హాజరయ్యారు. తిరిగి పయనం అయ్యేందుకు కారు వద్దకు వచ్చి చూడగా అద్దాలు పగులగొట్టి ఉన్నాయి. కారులో బ్యాగ్ మాయం కాగా, దానిలో ఐదు లక్షల నగదు, మూడు యాపిల్ ఫోన్లు, రెండు బంగారపు గొలుసులు, మూడు ఉంగరాలతో పాటు పాస్పోర్ట్, క్రెడిట్ కార్డ్ మాయమయ్యాయి. అర్ధరాత్రి దాటిన తర్వాత ఘటనపై త్రీ టౌన్ పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టారు.



మంత్రి లోకేష్‌తో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యులు

మంత్రి లోకేష్‌ను కలిసిన ఇబ్రహీం

ప్రజాశక్తి - మంగళగిరి

ఉండవల్లిలో మంత్రి నారా లోకేష్ నివాసంలో శుక్రవారం ఇటీవల నూతనంగా నియమి తులైన రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎమ్‌డీ ఇబ్రహీం, తన కుటుంబ సభ్యులతో మంత్రి లోకేష్‌ను కలసి ధన్యవాదాలు తెలిపారు. సందర్భంగా ఇబ్రహీం మాట్లాడారు. పార్టీలో తన సీనియార్టీని గుర్తించి నామినేట్ పదవి ఇచ్చిన మంత్రి నారా లోకేష్‌ను కుటుంబ సభ్యులతో కలసి వెళ్లి కృతజ్ఞతలు తెలియజేశామన్నారు. మైనారిటీస్, నియోజక వర్గం, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి సూచించారు. ఎమ్‌డీ రఫీ, నజీర్, జావీద్, ఆరిఫ్, షరీఫ్ పాల్గొన్నారు.

శ్మశాన స్థలం కేటాయించాలని సంతకాల సేకరణ



మాట్లాడుతున్న హయ్యర్ పేట నివాసులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

క్రైస్తవ సమధులతోట ఇరుకుగా మారడంతో మరో చోట స్థలం కేటాయించాలని కోరుతూ స్థానిక హయ్యర్ పేట గ్రామస్తులు కోరారు. క్రైస్తవ సమాధులు తోట సాధన కమిటీ సభ్యులు కారుమంచి సునీల్ సందీప్ తదితరులు ఆదివారం స్థానిక గ్రామస్తులతో సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. 40 ఏళ్లుగా క్రైస్తవులకు కేటాయించిన సమాధులతోట నిండిపోవడంతో కాలు పెట్టడానికి స్థలం లేకుండా పోయిందని హయ్యర్ పేట సంఘ పెద్దలు జ్యోతుల ఏసురత్నం, మధిర సతీష్ తెలిపారు. ప్రభుత్వం స్పందించి మరో ప్రదేశంలో అదనపు స్థలం కేటాయించాలని కోరారు. సమాధులు తోటకు స్థలం కేటాయించాలని కోరుతూ ఇటీవల సబ్ కలెక్టర్, తహశీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో నివేదిక సమర్పించినట్లు సునీల్ సందీప్ తెలిపారు. కార్యక్రమంలో వంపుగళ్ల సురేష్, బొనిగల ప్రదీన్, జ్యోతుల శేషు, చేబ్రోలు విజయ్ కుమార్, వంపుగళ్ల పరిశుద్ధరావు పాల్గొన్నారు.

సరికొత్త హంగులతో జికె జిమ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి- తాడేపల్లి

ఉండవల్లి దేవుడు మాన్యం ఎదురుగా శుక్రవారం జికె ఫిట్నెస్ జిమ్‌ని అట్టహాసంగా ప్రారంభించినట్లు ఛైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు. తెలుగుదేశం మండల అధ్యక్షుడు దాసరి కృష్ణ, టిడిపి నాయకులు కొల్లి శేషు, జనసేన నాయకులు జొన్నా రాజేష్ జిమ్‌ను, ఆపీసు రూమును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజధాని ఏర్పడిన తర్వాత జిమ్ కోసం విజయవాడ వెళ్లే అవసరం లేకుండా పది సంవత్సరాల క్రితమే జికె జిమ్ ప్రారంభించి ప్రజలకు సేవ చేస్తున్నారని చెప్పారు. జిమ్ ఛైర్మన్ గోపాలకఅష్ణ మాట్లాడుతూ మధ్యతరగతి పేదవారికి అనుకూలంగా రేట్లు తగ్గించి,కపుల్స్ కు ప్రత్యేక ప్యాకేజీలను సైతం ప్రకటించి, అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షతోనే ఈ జిమ్‌ని ప్రారంభించినట్లు తెలిపారు. పిలవగానే వచ్చిన పుర ప్రముఖులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దొంతు బాలాజీ, తెలుగుదేశం నాయకులు జొన్నా శ్రీనివాస్ రావు, బసివి రెడ్డి ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులను సన్మానిస్తున్న గోపాలకృష్ణ

ఎక్స్ సర్వీసెస్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు ప్రశంసనీయం



హాజీ షేక్ మస్తాన్‌కి ఘన సన్మానం

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు ఎక్స్ సర్వీసెన్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు అభినందనీయమని ఛైర్మన్ హాజీ షేక్ మస్తాన్ కొనియాడారు. శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సంస్థను 2020లో స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేసినందుకు, పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సారథ్యంలో మున్సిపల్ కమిషనర్, చేపట్టిన అనేక సేవా కార్యక్రమాలలో సంఘ సభ్యులు, సంఘ అధ్యక్షులు మేజర్ సుబేదార్ హానరరీ లెఫ్టినెంట్ షేక్ మస్తాన్, కేంద్ర మంత్రివర్యులు రాజ్నాథ్ సింగ్ చేతుల మీదగా ప్రశంసా పత్రం పొందటం గర్వకారణమన్నారు. పార్టీ పొన్నూరు నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, పట్టణ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్ ఖాన్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ బాజీ సాహెబ్, మైనార్టీ నాయకులు జానీ బేగ్, ఖదీర్, మౌలాలి, ఇస్మాయిల్, కాజా, తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఫైజుల్లా ఖాన్ (పండు) బాజీ (ఫర్టిలైజర్) రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని వడ్డేశ్వరం డిజిపి ఆఫీస్ సమీపాన గోపు గ్రాండ్ నూతన కళ్యాణ మండపం ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గన్నారు. ఈ సందర్భంగా గోపు గ్రాండ్ నూతన కళ్యాణమం డపం అధినేత గోపు నాగ రాజేష్ మాట్లాడుతూ అత్యాధునిక హంగులతో వివాహ వేడుకలకు శుభకార్యా లకు గోపు గ్రాండ్ కళ్యాణ మండపం ఏర్పాటు చేసినట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జొన్నా రాజేష్, వైసిపి నాయకులు బుర్ర ముక్కు వేణు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రామకృష్ణ శెట్టి, రొటేరియన్స్ రామ కృష్ణ శెట్టి, మున్నంగి వివేకా నందరెడ్డి, రావూరి రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



ప్రారంబమైన గోపు గ్రాండ్ కళ్యాణమండపం



దుస్తులు పంపిణీ చేస్తు కమిషనర్

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా స్థానిక సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో గురువారం ఎంటిఎంసి పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు, శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవస్థానంలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి కమిషనర్ ఆలిం బాషా నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆలిం భాష, అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న భజన మండలి వారిని అభినందించారు. రాష్ట్ర సత్య సాయి సేవా సంస్థ ఉపాధ్యక్షులు సురేంద్ర, రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల జిల్లా కోఆర్డినేటర్ శిరీష, జిల్లా మహిళా సేవాదళ్ కోఆర్డినేటర్ హేమలత,శ్రీ సత్య సాయి సేవ సంస్థల రాష్ట్ర మెడికల్ కోఆర్డినేటర్ ఈ సాయి కృష్ణ, మంగళగిరి శ్రీ సత్యసాయి భజన మండలి మహిళా కోఆర్డినేటర్ శ్రీమతి ఉదయలక్ష్మి, మంగళగిరి కన్వీనర్ రాయపాటి రామారావులు మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా మంగళగిరి పరిధిలో నిర్వహిస్తున్నటువంటి పలు సేవా కార్యక్రమాల గురించి వివరించారు.



ఇందిరా నగర్ యుపిహెచ్‌సి

ఉత్తమ స్వచ్ఛ హాస్పిటల్‌గా ఇందిరానగర్ యుపిహెచ్‌సి

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రభుత్వం వివిధ కేటగిరీలలో ప్రకటించిన స్వచ్ఛ ఆంధ్ర- 2025 అవార్డులకు మంగళగిరి ఎర్బీనగర్ సచివాలయం పరిధిలోని గణపతి నగర్లోని ఇందిరా నగర్ యూపీహెచ్సీ జిల్లాస్థాయిలో ఉత్తమ స్వచ్ఛ హాస్పిటల్‌గా ఎంపికైంది. ప్రభుత్వం గురువారం ప్రకటించిన జిల్లా, రాష్ట్రస్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల జాబితాలో ఇందిరానగర్ యూపీహెచ్సీ జిల్లాస్థాయిలో ఉత్తమ స్వచ్ఛ హాస్పిటల్‌గా స్థానం సంపాదించుకుంది. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష మాట్లాడుతూ హెల్త్ సెంటర్ జిల్లాలో ఉత్తమ స్వచ్ఛ హాస్పటల్‌గా ఎంపిక అవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సిఎంకు, మంత్రి లోకేష్, ఎన్పీసీడీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మిలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

వాటర్ ట్యాంక్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని పెనుమూలి గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంక్‌కు సర్పంచ్ కొరిటాల పద్మావతి ఆధ్వర్యంలో శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. ఆధునిక హంగులతో రంగులు వేస్తున్నారు. అత్యంత ఎత్తుగా ఉన్న వాటర్ ట్యాంక్‌కు క్రేన్ సహాయంతో కూలీలు రంగులు వేస్తున్నారు. ఇటీవల జరిపిన నీటి శాంపిల్స్ పరీక్షలలో పంచాయితీ ట్యాంకులలో నీరు సురక్షితమైనవిగా ఫలితాలు రావడంతో గ్రామ ప్రజలు సచివాలయం సమీపంలో ఉన్న ట్యాంక్ నీటిని వినియోగిస్తున్నారు.

నేడు 'ఆటో డ్రైవర్ సేవ' పథకం ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లి

శనివారం ఉదయం ఉండవల్లి (ప్రకాశం బ్యారేజ్) వద్ద నుండి ఆటో ఎక్కి ఆటో డ్రైవర్ సేవలో పథకాన్ని సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారని ఆ పార్టీ కార్యాలయ శుక్రవారం వర్గం తెలిపింది. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, మంత్రులు పాల్గొంటారని తెలిపారు.

పరిశ్రమల అభివృద్ధికి బ్లూ ప్రింట్ తయారు చేయండి

అధికారులను ఆదేశించిన పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి బ్లూ ప్రింట్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అందించిన భూములలో మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో పరిశ్రమల ఇతర శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నష్టాలలో నడుస్తున్న పరిశ్రమలకు ప్రభుత్వం నుంచి సాయం అందించగలిగే అవకాశాలను అన్వేషించాలన్నారు. పరిశ్రమల శాఖ, నైపుణ్యాభివృద్ధి శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండు శాఖల సిబ్బంది, కార్యక్రమాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంపై నైపుణ్యాభివృద్ధి శాఖ దృష్టి సారించాలన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులందరికీ 100 శాతం ఉపాధి అవకాశాలు దక్కేలా చూడాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, ఎల్.డి.ఎం రాంప్రసాద్, డి ఆర్.డి.ఏ అసిస్టెంట్ పీడీ ఆర్ ప్రతాప్, జిల్లా పరిశ్రమల అధికారి నవీన్, జె.డ్.ఎం ఏపిఐఐసి డాక్టర్ ఎల్.ఎం నరసింహారావు, జిల్లా అదనపు నైపుణ్య అభివృద్ధి అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.



ఉండవల్లి సెంటర్‌లో సిపిఎం నిరసన

యువ గళం హామీని నిలబెట్టుకోండి

నేటి నుండి ఎమ్‌టిఎంసి పరిధిలో పాదయాత్రలు

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజి

ప్రజాశక్తి- తాడేపల్లి

ఎన్నికలకు ముందు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ కోరారు. మంగళగిరి నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ, శుక్రవారం ఉండవల్లి సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతు ఎంటిఎంసి పరిధిలో సీతానగరం వద్ద శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి, మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ఇల్లు లేని నిరుపేదలుగా ఉన్న 20వేల మందికి ఇల్లు నిర్మించి ఇస్తామని వాగ్దానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణ ప్రాంతాల్లో ఇళ్లులేని వారందరికీ రెండు సెంట్లు ఇళ్ల స్థలం, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇస్తామని చేసిన వాగ్దానం మంత్రి మర్చిపోయినట్టు ఉన్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచి పోయిందని, ఎంటిఎంసి పరిధిలో ఇళ్లు లేని పేదల జాబితా తయారు చేసే పని కూడా ఇంతవరకు ప్రారంభించలేదని నేతాజీ అసంతృప్తి వ్యక్తం చేశారు. జాబితా ఎప్పుడు తయారు చేస్తారు, ఈ 20 వేల మందికి ఇళ్ళస్థలం ఇచ్చేందుకు అవసరమైన భూమి ఎప్పుడు సేకరిస్తారు, వారికి ఇళ్లు ఎప్పుడు నిర్మిస్తారని నేతాజీ మంత్రి లోకేష్‌ను ప్రశ్నించారు. తక్షణమే ఇళ్లు లేని నిరుపేదల జాబితాను తయారు చేసి ప్రకటించాలని, వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు భూసేకరణకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం శనివారం నుండి మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్రలు నిర్వహించి, మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేపడతామని అన్నారు. ఇళ్లు, ఇళ్లస్థలాలు కోరుకునే పేదలందరితో వ్యక్తిగతంగా అర్జీలు పెట్టించి సామూహికంగా అధికారులకు వినతి పత్రాలు అందజేస్తామని అన్నారు. మంత్రి లోకేష్ స్పందించి ఇళ్ల స్థలాల దరఖాస్తులను పరిశీలన చేయించి అర్హుల జాబితాలు ప్రకటించాలని కోరారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే, బాధిత ప్రజలను సమీకరించి ఇళ్ల స్థలాలసమస్య పరిష్కారం కోసం రానున్న కాలంలో పెద్ద ఎత్తున సిపిఎం ఉద్యమిస్తుందని నేతాజీ హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, జొన్నకూటి నవీన్ ప్రకాష్, కుంభ ఆంజనేయులు, పేరం బాబురావు, షేక్ జానీ, కె రామకృష్ణ,సైకం వెంకటనారాయణ, జి చెంచయ్య పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి మీరే వారధులు : కలెక్టర్

ప్రజాశక్తి - గుంటూరు : నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపించడంలో యంగ్ ప్రొఫెషనల్స్ కీలకపాత్ర వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నియోజక వర్గ ప్రత్యేక అధికారులు, యంగ్ ప్రొఫెషనల్స్‌తో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నత విద్యార్హత కలిగి, యంగ్ ప్రొఫెషనల్స్‌గా చేరిన మీ విజ్ఞానం వృధా కాకుండా సమాజ హితానికి దోహదం కావాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో నియోజవర్గ స్థాయిలో కార్యాలయాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఈవ్యవస్థను విజయవంతం చేయడంలో ధృడ సంకల్పంతో పని చేయాలని కోరారు. నియోజకవర్గాల స్థాయిలో తయారు చేయబడిన విజన్ యాక్షన్ ప్లాన్ పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మీడియాలో వస్తున్న సానుకూల, వ్యతిరేక వార్తలను పరిశీ లించి వివరాలు తెలుసుకోవాలని, తద్వారా అవగాహన పెంపొందుతుందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన కార్యక్రమాలు (ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్‌లు) – ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) తదితర అంశాల అమలు లో భాగస్వా మ్యం కావాలని ఆదేశించారు. నియోజక వర్గాల ప్రత్యేకాధికారులు, ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీ సిఇఒ జ్యోతిబసు, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.నాగేశ్వరరావు, జిఎంసి అడిషనల్ కమిషనర్ సిహెచ్.ఓబులేసు పాల్గొన్నారు.

రైతులకు లాభదాయకంగా చర్యలు చేపట్టాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా



ప్రజాశక్తి-గుంటూరు

వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో పెట్టుబడులు తగ్గి, రైతులకు లాభదాయకత పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రాథమిక రంగాల శాఖలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక రంగాల శాఖలు నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేస్తూ వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో లాభదాయకత పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ రంగాల్లో ప్రతి అంశాన్ని విశ్లేషణాత్మకంగా పరిశీలించాలని సూచించారు. ఏ విషయాన్ని సాధారణంగా తీసుకోరాదని, భవిష్యత్తు అవసరాలను ముందుగా గుర్తించాలని స్పష్టం చేశారు. పంటల విధానం (క్రాప్ పాటర్న్) మ్యాపింగ్‌ను తయారు చేయాలని, ఉత్తమ విధానాలను డాక్యుమెంట్ చేయాలని అన్నారు. స్థూల విలువ ఆధారిత పెంపునకు అవకాశాలు పెంపుదలకు కృషి చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయా ధికారి ఎ.నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖకు 43 సూచికలు ఉన్నాయని, రైతు సేవా కేంద్రాల స్థాయిలో లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, వ్యవసాయ ఉత్పాదకత, విస్తరణ రంగాల్లో దృష్టి సారించినట్లు చెప్పారు. పశు సంవర్ధక శాఖ జేడీ కెవివి సత్యనారాయణ మాట్లాడుతూ విజన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మాంసం, పాలు, గుడ్లు ఉత్పాదకత పెంపుపై దృష్టి సారిస్తున్నామన్నారు. కృత్రిమ గర్భధారణ పద్ధతులను ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి శేషశ్రీ, జిల్లా మత్స్య శాఖాధికారి పి.ఎన్. కిరణ్ కుమార్, అటవీ, జలవనరులు, భూగర్భ , ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ



జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంయుక్త కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ధాన్య సేకరణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో 3,89,849 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా ఉందని, ఇందులో డిసెంబర్ 2025 నుండి 50 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయటానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 177 రైతు సేవాకేంద్రాలు , 45 రైతు సేవా క్లస్టర్ల ద్వారా ధాన్యం సేకరించడం జరుగు తుందన్నారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,389లు, సాధారణ రకానికి రూ.2,369 లకు కొనుగోలు చేయడం జరుగు తుందన్నారు. వ్యవసాయ అధికారులు ఇ-పంట, ఈ-కేవైసీ వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ అధి .కారులు పండించిన పంట రకాన్ని గుర్తించాలని, తేమ శాతం అధికంగా వుండకుండా చూడాలన్నారు. ధాన్యం సేకరణ నిబంధనలను రైతులకు తెలియజేయాలని, రైతులు తమ పంటను ఏమిల్లులకు అందించాలను కుంటున్నారో తెలుసుకుని ఆ మిల్లులకు పంటను తరలించేలా సివిల్ సప్లయ్ అధికా రులు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం తరలించే వాహనాలకు జీపీఎస్ వుండేలా రవాణా శాఖాధికారులు చర్యలు తీసుకోవా లన్నారు. తేమ శాతం అధికంగా వుంటే డ్రైయర్లను ఉపయోగించుకోవాలన్నారు. రైతులకు అవ సరమైన టార్పాలిన్‌లు సరఫరా చేయటానికి మార్కెటింగ్ శాఖాధికారులు, ధాన్యం తుకానికి సంబంధించి లీగల్ మెట్రాలజీ అధికారులు పకడ్బంధీ చర్యలు తీసుకోవాలని, ధ్యానం లోడింగ్ , అన్‌లోడింగ్ చేసేందుకు సరిపడా హమాలీలను సిద్ధం చేసుకోవాలని కార్మిక శాఖ అధికారులకు సూచించారు. మిల్లర్లు మాట్లా డుతూ టార్పాలిన్‌లు సబ్సిడీపై అందించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరగా, ఈ విషయమై ప్రభు త్వానికి తెలియ జేసి తదుపరి చర్యలు తీసుకుంటామని సంయుక్త కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జన రల్ మేనేజర్ సివిల్ సప్లయ్ పి.జయంతి, పౌర సరఫరాలు, వ్యవసాయ, రవాణా, మార్కెటింగ్ శాఖల అధికారులు, జీడీసీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్, మిల్లర్లు పాల్గొన్నారు.

రేపు ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-గుంటూరు

కెవిఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అక్టోబర్ 5న మధ్యాహ్నం రెండు గంటలకు 50 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.రత్నషీలామణి, ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి, డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, లయన్స్‌క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా మాజీ గవర్నర్ నూతలపాటి వీర ప్రకాశరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

జిల్లాలో 13,193 మందికి 'ఆటో డ్రైవర్ సేవ'

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో 13,193 మంది ఆటో డ్రైవర్ సేవలో పథకం కింద లబ్ది పొందనున్నారు. శనివారం ఈ పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి విజయవాడలో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. గుంటూరు నగరంలో జిల్లా స్థాయి కార్యక్రమం రెవెన్యూ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నారు. చేబ్రోలు మండలం 453 మంది, దుగ్గిరాల 344, గుంటూరు అర్బన్ 5,078, గుంటూరు రూరల్ 319, కాకుమాను 131, కొల్లిపర 164, మంగళగిరి 516, మేడికొండూరు 404, పెదకాకాని 711, పెదనందిపాడు 153, ఫిరంగిపురం 250, పొన్నూరు 530, పత్తిపాడు 281, తాడేపల్లి 383, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ 1038, తాడికొండ 440, తెనాలి 1338, తుళ్లూరు 399, వట్టిచెరుకూరు 261 మొత్తం 13,193 మందికి ఇవ్వనున్నారు.

పోలీస్ స్టేషన్ నిర్వహణపై శ్రద్ధచూపండి : ఎస్‌పి



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక నల్లపాడు పోలీసు స్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ కార్యకలాపాలను సమగ్రంగా సమీక్షిం చారు. ప్రాంతాల వారీగా కేసుల నమోదు వివరాలను, శాంతి భద్రతలకు విశ్లేషించారు. పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత పట్ల శ్రద్ధ వహించి, స్వీయ పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డుల నిర్వహణ సరిగా ఉంచాలన్నారు. ఎప్పటికప్పుడు రికార్డులను అప్‌డేట్ చేయా లన్నారు. తండింగులో ఉన్న కేసుల పురోగతిని వేగవంతం చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. పోలీస్ సిబ్బందితో మాట్లాడి ప్రజల పట్ల పోలీసులు ప్రవర్తించే తీరు, వారి నుండి ఫిర్యాదులు స్వీకరించే విధానం, పోలీస్ అధికారుల దృష్టికి ఫిర్యాదులు తీసుకెళ్లే విధానం తెలుసుకుని, ఫిర్యాదుల స్వీకరణను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, అవి నిరంతరం సక్రమంగా పనిచేసే విధంగా సరైన పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కేసుల్లో సీజ్ చేసిన వాహనాల విడుదల ప్రక్రియను పరిశీలించి, దానిని చట్టపరమైన నిబంధనలకు లోబడి పార దర్శ కంగా నిర్వహించాలని సూచించారు. అలాగే, పోలీస్ అధికారులు సిబ్బందితో పరస్పర చర్చలు జరిపి, విధుల్లో మరింత జాగ్రత్త, క్రమశిక్షణ, పారదర్శకతతో వ్యవ హరించాలని సూచించారు. ప్రజలకు భరోసా కల్పించే విధంగా వారి సమస్యలకు సకాలంలో స్పంది స్తూ, పరిష్కారం చూపే దిశగా కృషి చేసి ఆదర్శ ంగా నిలపడం లక్ష్యంగా పెట్టుకోవాలని స్పష్టంచేశారు. డిఎస్‌పి భానో దయ, ఎస్‌బి సిఐ ఆలహరి శ్రీనివాస్, నల్లపాడు సిఐ వంశీధర్ పాల్గొన్నారు.

సిబ్బంది ఫిర్యాదుల పరిశీలన

జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు సిబ్బంది నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వారికి రావాల్సిన సదుపాయాలు, ప్రభుత్వం నుంచి అందాల్సిన భత్యాలు, విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదుల పురోగతిని పరిశీలించారు.